ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 18 మార్చి 2025



కిరండూల్ రైలు అరకులోయ వరకే..

- 2 నుంచి 10వ తేదీ వరకు ఇదే పరిస్థితి

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని దార్లిపుట్, పాడువ స్టేషన్ల మధ్య ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య (58501, 58502 నంబర్లతో ఇరువైపులా) నడిచే పాసింజర్ రైళ్లు ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ మధ్య అరకులోయ వరకూ వెళతాయని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

మేయర్‌పై అవిశ్వాసం?


గొలగాని హరి వెంకటకుమారి బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగేళ్లు

అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు చట్టపరంగా అవకాశం



మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

- ఇప్పటికే సంతకాలు సేకరణ చేపట్టిన కూటమి
- రెండు, మూడు రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చే అవకాశం
- మేయర్ మార్పుపై విజయవాడలో సీఎంతో చర్చించిన ఎమ్మెల్యేలు
- నేడు టీడీపీలో చేరనున్న ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లు
- ప్రతివ్యూహ రచనలో వైసీపీ
- పార్టీ కార్యాలయంలో సమావేశమైన నేతలు
- నేడు మాజీ మంత్రి కన్నబాబు ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో సమావేశం
- వేడెక్కిన గ్రేటర్ రాజకీయం





జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో రాజకీయం వేడెక్కింది. మేయర్‌గా గొలగాని హరివెంకట కుమారి బాధ్యతలు చేపట్టి మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తికానుండ డంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు చట్టపరంగా అవకాశం ఏర్పడింది. అందుకు కూటమి సిద్ధమవుతోంది. ఈ మేరకు వారంలోగా అవిశ్వాస తీర్మానంపై వారంలోగా కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది.

జీవీఎంసీకి నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో వైసీపీ 59, టీడీపీ 29, జనసేన 3, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఒక్కొక్క వార్డు గెలుచుకున్నాయి. ఇండిపెండెంట్లు నాలుగుచోట్ల విజయం సాధించారు. రాష్ట్రంలో అప్పటికి వైసీపీ అధికారంలో ఉండడం, మెజారిటీ వార్డులను ఆ పార్టీ దక్కించుకోవడంతో ఇండిపెండెంట్‌లుగా గెలిచిన నలుగురు కార్పొరేటర్లు అధికార పార్టీకి మద్దతు పలికారు. టీడీపీకి చెందిన ఒక కార్పొరేటర్ వైసీపీలో చేరిపోగా, మరో ఇద్దరు కూడా ఆ జగన్ పార్టీకి మద్దతు పలికారు. వైసీపీకి భారీ మెజారిటీ ఉండడంతో మూడు సార్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకుంది. అయితే 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో బలాలు తారుమారయ్యాయి. వైసీపీలో చేరిన నలుగురు ఇండిపెండెంట్‌ల్లో ఇద్దరు టీడీపీ, మరో ఇద్దరు జనసేనలో చేరిపోయారు. అలాగే వైసీపీకి చెందిన దాదాపు 20 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరిపోయారు. టీడీపీ నుంచి గెలిచినప్పటికీ వైసీపీకి మద్దతు పలికిన ఇద్దరు కార్పొరేటర్లు తిరిగి టీడీపీకి మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో కూటమి బలం 53కి పెరగ్గా, వైసీపీ బలం 38కి తగ్గిపోయింది. దీంతో గత ఏడాది జూలైలో జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ఆ తర్వాత మేయర్ గొలగాని హరివెంకటకుమారిని పదవి నుంచి దింపే ప్రయత్నాలు కూటమి నేతలు మొదలుపెట్టారు. కానీ అవిశ్వాసం పెట్టాలంటే కనీసం నాలుగేళ్ల పదవీకాలం పూర్తవ్వాలనే నిబంధన మునిసిపల్ చట్టంలో ఉండడంతో వీలుకాలేదు. ఈనెల 18 నాటికి మేయర్ పదవి చేపట్టి నాలుగేళ్ల పూర్తవడంతో కూటమి నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కూటమి కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సంతకాలతో నోటీస్ సిద్ధం చేశారు. కలెక్టర్‌కు నోటీసు అందజేసేముందు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి మేయర్ మార్పు విషయాన్ని వివరించాలని

... మిగతా 6వ పేజీలో

కైలాసగిరిపై నేచర్ కాటేజీల టెండర్ల రద్దు

- అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనవద్దు
- నెలాఖరులోగా మల్టీలెవెల్ కారు పార్కింగ్, బీచ్‌రోడ్డులో సీ హారియర్ మ్యూజియం ప్రారంభం
- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్, పక్కన కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై నేచర్ కాటేజీల నిర్మాణానికి సంబంధించిన టెండర్లను రద్దు చేశామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. వీఎంఆర్‌డీఏ తొమ్మిదో అంతస్థులో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరంలో కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. నేచర్ కాటేజీలపై కోర్టు కేసులు ఉన్నాయని, అందువల్ల టెండర్లను రద్దు చేశామని వివరించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో ప్రైవేటు లేఅవుట్ల ప్లాట్ల సమస్యలే ఎక్కువగా వస్తున్నాయని, అందువల్ల అనధికార లేఅవుట్లలో తక్కువ ధరకు ప్లాట్లు వచ్చినా కొనుగోలు చేయవద్దని సూచించారు. వీఎంఆర్‌డీఏ ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్పుల్లో తక్కువ ధరకే ప్లాట్లను అందిస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ల సూచనల మేరకు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి వీఎంఆర్‌డీఏ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సిరిపురంలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం, బీచ్ రోడ్డులో సీ హ్యారియర్ హెలికాప్టర్

... మిగతా 6వ పేజీలో

బ్లడ్ బ్యాంకులు ఖాళీ

నిండుకుంటున్న నిల్వలు

ఏటా వేసవిలో సమస్య



- ఈ ఏడాది మార్చిలోనే మొదలుకావడంతో సర్వత్రా ఆందోళన
- రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశం
- ప్రస్తుతం 200 యూనిట్ల వరకు సేకరణ... అవసరం 500 యూనిట్లు
- దాతలు ముందుకొస్తేనే సమస్యకు పరిష్కారం

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలోని బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు నిండుకుంటున్నాయి. వేసవి కాలంలో దాతలు తగ్గడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవు తుంటుంది. ఏటా మే, జూన్ నెలల్లో సమస్య అధికంగా ఉంటుంది. కానీ, ఈ ఏడాది మార్చి నెలలోనే కనిపిస్తుండడం కొంత ఆందోళన కలిగిస్తోంది.

విశాఖ జిల్లాలో 20 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఒక్కొక్కటి రోజుకు 10 నుంచి 15, కొన్ని 25 యూనిట్ల వరకూ రోగులకు అందిస్తుంటాయి. దాదాపు మూడొంతుల యూనిట్లను దాతలు లేకపోయినా ఇస్తుంటాయి. కొన్నింటికి మాత్రం డోనర్స్‌ను వెంటబెట్టుకుని రోగి బంధువులు వెళ్లాల్సి ఉంటుంది. అయితే, గడిచిన కొద్దిరోజుల నుంచి ఎండ తీవ్రత అధికం కావడం, విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కావడంతో రక్త సేకరణ తగ్గింది. దీనివల్ల రోగులకు అవసరమైన మేరకు యూనిట్లను సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 20 బ్లడ్ బ్యాంకుల నుంచి గతంలో 400కుపైగా యూనిట్లు అందించేవారు. ప్రస్తుతం 200 నుంచి 300 యూనిట్లు మాత్రమే ఇవ్వగలుగుతున్నారు. నగరంలోని ఒక ప్రధాన బ్లడ్ బ్యాంకు నుంచి ప్రతిరోజూ 15 యూనిట్లకు తక్కువ కాకుండా రోగులకు ఇచ్చేవారు. గడిచిన వారం నుంచి ఐదారు యూనిట్లకు మించి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో బ్లడ్ కోసం వచ్చే వారు డోనర్‌తో రావాలని సూచిస్తున్నారు.

బ్లడ్ బ్యాంకులు సేకరించే యూనిట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. బ్లడ్ బ్యాంకులు విద్యార్థులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులను ఏర్పాటు చేయడం ద్వారా కనీసం 10 నుంచి 15 యూనిట్లు సేకరించుకుంటాయి. కానీ, గడిచిన రెండు, మూడు వారాల నుంచి సేకరించే యూనిట్ల సంఖ్య తగ్గినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

మరింత ఇబ్బంది

ప్రస్తుతం వేసవి ప్రారంభ దశలోనే ఉంది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరుగుతుంది. విద్యా సంస్థలకు సెలవులు కూడా ఇస్తారు. ఇది బ్లడ్ సేకరణపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసరం అంటే కొంతమంది విద్యార్థులు స్పందించి ముందుకువస్తున్నారు. అదే పూర్తిస్థాయిలో సెలవులు ఇచ్చేస్తే నగరంలో ఉండే విద్యార్థులు కూడా ఉండరు. కాబట్టి, జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టిసారించే ముందస్తు చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

వేసవిలో ఎందుకంటే?

ప్రతిరోజూ జిల్లాలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల కోసం 400 యూనిట్లు బ్లడ్ అవసరం అవుతుంది. అయితే, వేసవిలో 500 యూనిట్ల వరకు అవవసరం అవుతుంది. దీనికి

... మిగతా 6వ పేజీలో



కేడీపీఎం పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

టెన్త్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 99.58 శాతం హాజరు
- తనిఖీలు చేసి కేంద్రాలలోకి అనుమతి

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 134 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు/హిందీ/ఉర్దూ/ఒరియా పరీక్షకు మొత్తం 28,659 మందికిగాను 28,540 మంది (99.54 శాతం) హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 28,523కి 28,444, ప్రైవేటు విద్యార్థులు 136 మందికి 96 మంది పరీక్షలు రాశారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల లోపలకు అనుమతించేటప్పుడు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎలక్ట్రానిక్ వాచీలు, ఇతర పరికరాలను తీసుకువెళ్లనివ్వలేదు. ఎండాడలోని ప్రభుత్వ అంధుల బాలికల పాఠశాల విద్యార్థినులు, లాసన్స్‌బే కాలనీలో ఓంకార్ లయన్స్ పాఠశాల, మరికొన్ని ప్రైవేటు పాఠశాలలకు చెందిన మూగ, బధిర విద్యార్థులు చినవాల్తేరులోని కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో పరీక్షలు రాశారు. వారందరికీ విద్యా శాఖ స్రైబ్స్ ఏర్పాటు

... మిగతా 6వ పేజీలో

మేఫేర్ రిసార్ట్స్‌కు 40 ఎకరాలు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం మండలం అన్నవరంలో మేఫేర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంస్థకు 40 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థ భారీ కన్వెన్షన్ సెంటర్‌తో పాటు రిసార్ట్స్ నిర్మిస్తామని ప్రతిపాదనలు సమర్పించగా...రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు వాటిని పరిశీలించి 40 ఎకరాలు కేటాయించవచ్చునని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాంతో మంత్రి వర్గం ఆ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. తక్షణమే ఆ భూమికి సరిహద్దులు గుర్తించి ఇవ్వాలని సూచించింది. అలాగే ఆ సంస్థను ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చాలని ఆదేశించింది. ఆ ప్రాజెక్టుకు అవసరమైన రహదారి, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులు వీలైనంత త్వరగా కల్పించాలని, జిల్లా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ ప్రాజెక్టులో తొలుత 200 మందికి ఉపాధి లభిస్తుంది. ఏడేళ్లలో నిర్మాణం పూర్తిచేసి రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావలసి ఉంటుంది. అప్పుడు అదనంగా మరో 750 మందికి ఉపాధి లభిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.10 (మంగళవారం సాయంత్రం)

సహర్: 4.45 (బుధవారం ఉదయం)

దాకమర్రి లేఅవుట్‌లో ప్లాట్ల ధరల తగ్గింపు

- రూ.21 వేల నుంచి రూ.15,500కు...
- వీఎంఆర్‌డీఏ చరిత్రలో ఇదే తొలిసారి
- 28 వరకు దరఖాస్తుల స్వీకరణ...
- 31న ఈ వేలం



దాకమర్రి లేఅవుట్ ముఖద్వారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగమనం, ధరలు భారీగా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దాకమర్రి ఫార్చ్యూన్ లేఅవుట్ విషయంలో విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ గతంలో వేలం నిర్వహించినప్పుడు ఎంఐజీ ప్లాటు గజం రూ.21 వేలు చొప్పున అమ్ముడు పోయింది. ఆ ధరను ఇప్పుడు రూ.15,500కు తగ్గించి అమ్మకానికి పెట్టారు. వీఎంఆర్‌డీఏ చరిత్రలో ప్లాట్ల ధరలు తగ్గించడం ఇదే ప్రథమం.

విశాఖపట్నానికి 30 కిలోమీటర్ల దూరాన విజయనగరం జిల్లా శివార్లలోని దాకమర్రిలో రెండున్నర దశాబ్దాల క్రితం వెన్సార్ మిడోస్‌తో కలిసి జాయింట్ వెంచర్ కింద వుడా (నేడు వీఎంఆర్‌డీఏ) 98.84 ఎకరాల్లో లేఅవుట్ వేసింది. అందులో హెచ్‌ఐజీ 183, ఎంఐజీ 348, ఎల్‌ఐజీ 250, ఈడబ్ల్యుఎస్ 304 ప్లాట్లతో పాటు మౌలిక వసతుల కోసం మరో 14 ప్లాట్లు వేశారు. అన్నీ కలిసి మొత్తం 1,163 ప్లాట్లు కాగా అందులో వీఎంఆర్‌డీఏ వాటాగా 941 ప్లాట్లు తీసుకొని, డెవలపర్ వెన్సార్ మిడోస్‌కు 322 ప్లాట్లు ఇచ్చారు. అందులో మొదట హెచ్‌ఐజీ, ఎంఐజీ ప్లాట్ల విక్రయానికి వేలం పాట నిర్వహించారు. దాకమర్రి పరిసరాల్లో

... మిగతా 6వ పేజీలో

టిప్పర్ బీభత్సం

రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొన్న వాహనం

- సుమారు అడుగు మేర పక్కకు జరిగిన ట్రాక్
- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన గోదావరి, విశాఖ, మెయిల్, ప్రశాంతి, జన్మభూమి, రత్నాచల్...
- ఇబ్బందిపడిన ప్రయాణికులు



ట్రాక్ పునరుద్ధరణ పనులు చేస్తున్న అధికారులు, సిబ్బంది



సేఫ్టీ గడ్డర్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ ఇదే

అనకాపల్లి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున బండరాళ్ల లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. సేఫ్టీ గడ్డర్‌ను బలంగా ఢీకొనడంతో అది విరిగిపోయి రైల్వే ట్రాక్‌కు తగిలింది. దీంతో సుమారు అడుగు మేర ట్రాక్ పక్కకు జరిగింది. ఆ సమయంలో వస్తున్న గూడ్స్ రైలు లోకో పైలట్ గమనించి, ఎమర్జెన్సీ బ్రేకులు వేసి రైలును నిలుపుదల చేశారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటన కారణంగా విజయవాడ వైపు నుంచి విశాఖ వెళ్లే పలురైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. విజయరామరాజుపేట

... మిగతా 6వ పేజీలో

పబ్‌లు, బార్‌లలో పోలీసుల సోదాలు



బార్‌లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో మాదక ద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సీపీ శంఖబ్రతబాగ్చికి ఫిర్యాదులు అందాయి. దాంతో ఆకస్మిక తనిఖీలు చేయాలని నగరంలోని అన్ని స్టేషన్ల అధికారులను ఆదేశించారు. సుమారు 450 మంది పోలీస్ సిబ్బంది 92 బృందాలుగా విడిపోయి తమకు కేటాయించిన పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, పార్కింగ్, ఫైర్ ఎన్‌ఓసీ, సీసీ కెమెరాల ఏర్పాటు, అక్రమ మద్యం నిల్వలు, ఎంఆర్‌పీకే విక్రయం, సమయపాలన వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 14 బార్‌లకు ఫైర్ ఎన్‌ఓసీ, ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లకు ఫుడ్ లైసెన్స్, రెండు బార్‌లకు ట్రేడ్ లైసెన్స్, ఒక బార్‌కు జీఎస్‌టీ సర్టిఫికెట్ లేవని పోలీసులు గుర్తించారు. వీటిపై తగుచర్యల కోసం ఆయా శాఖలకు సమాచారం అందజేయనున్నట్టు సీపీ తెలిపారు.

నకిలీ డీలర్ల వ్యవహారంపై జేసీ సీరియస్

- డిపోలో ప్రతి డీలర్ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో నకిలీ రేషన్ డీలర్ల వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సీరియస్ అయ్యారు. ఒరిజినల్ డీలర్ మాత్రమే డిపో నిర్వహించాలని స్పష్టంచేశారు. 'నకిలీ డీలర్లదే హవా' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. నగరంలో ప్రతి రేషన్ డిపోను చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని, ఆ సమయంలో డీలర్‌తో ఫొటో దిగి దాన్ని వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయాలని

... మిగతా 6వ పేజీలో



మంగళసూత్రాలు చూపుతున్న అర్చకులు

ఘనంగా అప్పన్నస్వామి కల్యాణం

సింహాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో సింహచలేశుని కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద విద్యార్థులు



పద్మనాభంలోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

» అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు భీమిలిలో సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెర్రెలా రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, బీచ్ రోడ్డులో గల ఏపీ బాలికల గురుకుల పాఠశాల, జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్, ప్రకృతి ఇంగ్లిష్ మీడియం, పెదమంగమారిపేట జడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు ఉదయం గంటలకే అధిక సంఖ్యలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో చేరుకున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భీమిలి పరిధిలోని మొత్తం 14 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు నలుగురు రెగ్యులర్ విద్యార్థులు, ఒక ప్రైవేటు విద్యార్థి గైర్హాజరైనట్టు ఎంఈవో ఎం.శివరాణి తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు ప్రాథమిక వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశారు.

పద్మనాభం: మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే తమ తల్లిదండ్రులతో కలిసి చేరుకున్నారు. తొమ్మిది గంటల నుంచి విద్యార్థులను ఆయా కేంద్రాల్లోకి అనుమతించారు. మొత్తం 16 కేంద్రాల్లో 711 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా తొలిరోజు ఒకరు గైర్హాజరయ్యారు. ప్రత్యేక స్క్వాడ్ రవీంద్రబాబు, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావులు రేవిడి, రెడ్డిపల్లి, పద్మనాభం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంఈవో పి.రమణ అన్ని కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు సమకూర్చిన సౌకర్యాలను పరిశీలించారు. కాగా ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు తొలిరోజు హిందీ కావడంతో ఆ సబ్జెక్టును ఎంపిక చేసుకున్న ఐదుమందికి గాను నలుగురే హాజరయ్యారు.

భీమిలి చేరిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంత భద్రతపై మత్స్యకారులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పశ్చిమ బెంగాల్‌లోని భక్కాలీ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ సోమవారం మధ్యాహ్నం ఇక్కడకు చేరింది. ఈ సందర్భంగా సన్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు వారికి బ్యాండ్‌తో ఘనంగా స్వాగతం పలికారు. స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, తదితరులు వారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా తీరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్ అసిస్టెంట్ కమాండర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మన దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ ఎటువంటి విధులు నిర్వర్తిస్తుందో తెలియజేయడంతో పాటు తీర ప్రాంత భద్రతలో మత్స్యకారులు, ప్రజలు భాగస్వాములను చేసేందుకు వారిని చైతన్యపరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ఏకే అమిత్‌కుమార్, మహాపాత్ర, శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు కె.చిన్నారావు, ఎస్.లక్ష్మణ, వి.సత్యారావు, టి.రాందాసు, ఎన్.రమణ, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.



సీఐఎస్ఎఫ్ సిబ్బందితో స్కూల్ ప్రతినిధులు, విద్యార్థులు, మత్స్యకార నాయకులు

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి

భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిని లైంగిక వేధింపుల నుంచి చిన్నారులకు రక్షణగా వుండే పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని సీబీఐ కేసుల గౌరవ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సీఎస్ మూర్తి అన్నారు. సోమవారం భీమిలి నేరెళ్లవలస కాలనీలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు పోక్సో-2012 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేధింపులకు ఆడపిల్లలు భయపడవలసిన అవసరం లేదని, ఎక్కడైనా, ఎవరి నుంచి అయినా వేధింపులు ఎదురైతే ఎదిరించి పోక్సో చట్టాన్ని సద్వినియోగపర్చుకుని న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భీమిలి సీఐ బి.తిరుమలరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత సిటీ నగర్ జట్టు

భీమునిపట్నం (రూరల్) మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనాగమయ్యపాలెంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా సిటీ నగర్ జట్టు, రన్నరప్‌గా పాతపాలెం జట్టు నిలిచింది. విజేతల జట్లకు ట్రోఫీలతో పాటు రూ.60 వేలు, రూ.30 వేల చొప్పున ఆదివారం రాత్రి అందజేశారు. అలాగే ఉత్తమ బౌలర్‌కు రూ.5 వేలు, ఉత్తమ బ్యాట్స్‌మన్‌కు రూ.3వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.5 వేల చొప్పున యువజన నాయకుడు బి.దుర్గారావు అందించారు.

ప్రస్తుత విద్యా విధానాన్నే కొనసాగించాలి | అభిప్రాయం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు

భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా ఉండాలంటే ప్రస్తుత విద్యా విధానాన్నే కొనసాగించాలని మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాలల విలీనం జీవో-117పై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ జీవో గురించి ఎంఈవో ఎం.శివరాణి వివరించారు. నూతన విద్యా విధానం ప్రకారం 3,4,5 తరగతులను విలీనం చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన ప్రమాణాలను కూడా ఆమె తెలియజేశారు. అయితే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్కూల్ మేనేజిమెంట్ కమిటీల వారంతా ప్రస్తుతం విద్యా విధానాన్నే కొనసాగిస్తే గ్రామాల్లో పాఠశాలలు మూతపడకుండా ఉంటాయని, ఏమైనా మార్పులు చేస్తే స్కూళ్లు మూతపడడంతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడతారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు (వాసురాజు) మాట్లాడుతూ అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు తెలిపిన అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఎంఈవో-2 ఎ.జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా కార్యదర్శిగా మాధవరావు



భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శిగా బూరాడ మాధవరావు ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో మాధవరావును కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు స్థానిక జూనియర్ కాలేజీ అధ్యాపకులు తెలిపారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకునిగా ఆయన పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్‌తో పాటు అధ్యాపకులు మాదవరావుకు అభినందనలు తెలిపారు.

ఇద్దరి అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్) మార్చి 17 (ఆంధ్రజ్యోతి) భీమిలి మండలం కృష్ణంరాజుపేటలో పాల బంగార్రాజు (62) ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందింది. నాలుగు నెలల క్రితం ఇతని భార్య అప్పలకొండమ్మ మృతిచెందడంతో కుమార్తె తుపాకుల హేమలత తన ఇంటికి తీసుకుని వచ్చిందని పోలీసులు చెప్పారు. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతూ నాలుగుసార్లు ఇంటిలో నుంచి వెళ్లిపోగా వెతికి తెచ్చామని కుటుంబసభ్యులు తెలిపారు. హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని భీమిలి పోలీసులు తెలిపారు.



బంగార్రాజు (ఫైల్)

తగరపువలసలో మహిళ..

తగరపువలస: తగరపువలస కుమ్మ వీధికి చెందిన కొప్పాక మాధవీ లత (33) ఈ నెల 10న అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కొంత కాలంగా ఈమె మానసిక పరిస్థితి సరిగా లేదని, చికిత్స చేయించి మందులు వాడుతున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది క్రితం కూడా ఎవరికీ చెప్పకుండా ఇంటిలో నుంచి ఆమె వెళ్లిపోగా ఒడిశాలోని బ్రహ్మపుర పోలీసులు ఈమె ఆచూకీని తమకు తెలియజేశారని కుటుంబసభ్యులు తెలిపారు. లత సోదరుడు వెంకట శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని భీమిలి పోలీసులు తెలిపారు.



మాధవీ లత (ఫైల్)

చక్కని ఆహార అలవాట్లతో దంత సంరక్షణ సాధ్యం

సాగర్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో నోటి సంరక్షణ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ నోటి ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చక్కని ఆహార అలవాట్లతో పాటు దంతాలను శుభ్రం చేసుకోవడం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 20 వరకు వివిధ ప్రాంతాల్లో అవగాహన శిబిరాలు నిర్వహిస్తారు.

వాణిజ్య సూచికలపై పన్ను తగదు

» జడ్సీకి చిరువ్యాపారుల మొర » రద్దు చేయాలని కోరుతూ వినతి » పీజీఆర్ఎస్‌కు అందిన 11 అర్జీలు

భీమునిపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తగరపువలసలో వ్యాపార దుకాణాలకు చిన్న చిన్న నేమ్ బోర్డు (సూచికల)లపై పన్ను విధించడం పట్ల వర్తక సంఘం వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం భీమిలి జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జడ్సీ ప్రేమ ప్రసన్న వాణికి వర్తక సంఘం అధ్యక్షుడు దుర్గా మురళి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుకాణాల ముందు కేవలం చిన్న చిన్న ఐరన్ ప్లేట్లపై నేమ్ బోర్డులు రాసి పెడుతుంటామని, వాటికి కూడా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ ప్రకటనల పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేయడం తమను బాధిస్తోందని వర్తకులు ఏకరువు పెట్టారు. అసలే వ్యాపారాలు లేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామని, వేరే పనులు చేయలేక వ్యాపారాలు లేకపోయినా అలా జీవితాలను నెట్టుకొస్తున్నామని వాపోయారు. వాణిజ్య ప్రకటనల పేరిట విధించిన పన్ను రద్దు చేయాలని కోరారు. తగరపువలస మెయిన్‌రోడ్డులో 275 చిన్న, పెద్ద దుకాణాలు ఉన్నాయని, అందరూ ఈ నోటీసులతో అసంతృప్తిగా ఉన్నారన్నారు. వర్తక సంఘం నాయకులు బి.మహేష్, వెంకటనారాయణ తదితరులు వినతిపత్రం అందించినవారిలో ఉన్నారు. జీవీఎంసీ 3వ వార్డులో వేసవిలో గొల్లలపాలెం, కృష్ణాకాలనీ, తోటవీధి, ఎగువపేట, నేరెళ్లవలస తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తుతుందని, అందువల్ల ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మక నీటి సరఫరా పథకాలు మంజూరు చేయాలని కోరారు. 4వ వార్డు జె.వి.అగ్రహారంలో శ్మశానానికి వెళ్లడానికి సరైన దారి లేక గ్రామస్థులు నానా ఇక్కట్లు పడుతున్నందున తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ యువనాయకులు పాసి త్రినాథకుమార్, యువకులు జడ్సీకి వినతి అందించారు. సోమవారం మొత్తం 11 అర్జీలు వచ్చాయని, వాటిలో పట్టణ ప్రణాళికా విభాగానికి 4, ఇంజనీరింగ్ విభాగానికి 7 వినతులు అందాయని కార్యాలయవర్గాలు తెలిపాయి. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



వర్తక సంఘం అధ్యక్షుడు దుర్గా మురళి తదితరులు చెబుతున్న సమస్యను ఆలకిస్తున్న జడ్సీ ప్రేమ ప్రసన్న వాణి

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. ఈ మేరకు విజయవాడలో సోమవారం సీఎంతో ఎమ్మెల్యేలు చర్చించినట్టు తెలిసింది. వారి ఆదేశం మేరకు టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్లారు. సీఎం, డిప్యూటీ సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత బుధ, గురువారాల్లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కలెక్టర్‌కు నోటీసు అందజేసే అవకాశం ఉంది.

కూటమి, వైసీపీ నేతల వ్యూహ ప్రతివ్యూహాలు

కొత్త మేయర్ ఎన్నికకు కావాల్సిన సంఖ్యాబలం కూటమికి ఉన్నప్పటికీ, వైసీపీకి చెందిన కార్పొరేటర్లను మరింతమందిని చేర్చుకోవాలని టీడీపీ, జనసేన నేతలు వ్యూహరచన చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మరొక కార్పొరేటర్ మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. తర్వాత మరికొందరు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. మరోవైపు వైసీపీ కూడా కూటమి వ్యూహాలను తిప్పికొట్టే పనిలో పడింది. అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు ఇస్తే ఏం చేయాలి?, అవిశ్వాసం తీర్మానానికి అనుకూలంగా తమ పార్టీ సభ్యులు వ్యవహరిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది?, కూటమి ఎత్తులు పారకుండా చట్టపరంగా అందుబాటులో ఉన్న అవకాశాలపై చర్చించేందుకు ఆ పార్టీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, తైనాల విజయ్‌కుమార్‌తోపాటు మరికొందరు సోమవారం రాత్రి సమావేశమయ్యారు. పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు సమక్షంలో పార్టీ కార్పొరేటర్లతో మంగళవారం మరోమారు సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. వైసీపీ, కూటమి నేతల వ్యూహప్రతివ్యూహాలతో జీవీఎంసీ రాజకీయాలు వేడెక్కాయి.

దాకమర్రి లేఅవుట్‌లో ప్లాట్ల ధరల తగ్గింపు

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్లు వేసిన ప్రైవేటు డెవలపర్లు వారి భూముల ధరలు పెంచుకోవడానికి వ్యూహాత్మకంగా వారి మనుషులను వేలం పాటకు పంపించి అధిక ధరలకు పాడించేశారు. అక్కడ అప్పట్లో ప్రైవేటు లేఅవుట్‌లో గజం ధర రూ.4 వేలు ఉండగా వుడా వేలంలో గజం రూ.16,500కు పాడేశారు. మంచి రేటు వచ్చిందని అధికారులు సంబర పడ్డారు. అయితే ఆ రేటుకు కేవలం రెండు ప్లాట్లే అమ్ముడుపోయాయి. వుడాలో ఓ నిబంధన ఉంది. ఒకసారి వేలం పాటలో ఏ ధరకు విక్రయిస్తారో ఆ తరువాత నిర్వహించిన వేలంలో దానినే అప్‌సెట్ ధరగా నిర్ణయించి, ఆ రేటు లేదా అంతకంటే ఎక్కువకు అమ్మాలి. ఆ రేటు కంటే తక్కువకు ఇవ్వడానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో మిగిలిన ప్లాట్లను అమ్మడానికి మళ్లీ వుడా వేలం నిర్వహించగా రెండో సారి ప్రైవేటు డెవలపర్లు గజం రూ.21 వేలకు పాడేశారు. అప్పుడు ఒక్క ప్లాటే ఆ ధరకు వెళ్లింది. అదే సమయంలో దాకమర్రి పరిసరాల్లో వుడా రేటులో సగం ధరకే తాము ప్లాట్లు ఇస్తామంటూ ప్రైవేటు డెవలపర్లు వారి లేఅవుట్లలో గజం రూ.10వేలు చొప్పున అమ్ముకొని భారీగా లాభపడ్డారు. ఆ తరువాత వీఎంఆర్‌డీఏ సుమారుగా ఎనిమిది సార్లు దాకమర్రి ప్లాట్లు వేలానికి పెట్టింది. అప్‌సెట్ ధర గజం రూ.21 వేలు పెట్టడం వల్ల కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. కనీసం ఎవరూ దరఖాస్తు కూడా చేయలేదు. ఎందుకిలా జరుగుతోందని అధికారులు ఆరా తీశారు. అప్పుడు వాస్తవాలు తెలిశాయి. బయట మార్కెట్ ధర కంటే వీఎంఆర్‌డీఏ రేటు ఎక్కువగా ఉందని, ఆ రేటు ఉన్నంత కాలం ఎవరూ ముందుకు రారని తెలుసుకొని దానిని తగ్గించడానికి చర్యలు చేపట్టారు.

రెండు నెలల కసరత్తు

వీఎంఆర్‌డీఏ నచ్చినట్టు రేట్లు తగ్గించడం కుదరదు కాబట్టి దీనిపై నిర్ణయం కోసం ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇక్కడి కమిషనర్ విశ్వనాథన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మార్కెట్ విలువ, బయట అమ్మకం ధరలు తెప్పించి, పరిస్థితిని వివరిస్తూ లేఖ రాశారు. దాంతో ధర నిర్ణయానికి కమిటీని వేశారు. జీవీఎంసీ కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఇలా అంతా కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంత వరకు తగ్గించవచ్చునో సూచిస్తూ నివేదిక పంపారు. దాంతో గజం రూ.21 వేలు ఉన్న ధరను రూ.15,500కు విక్రయించాల్సిందిగా ఆదేశాలు రావడంతో ఈ నెల మొదటివారంలో వీఎంఆర్‌డీఏ ప్రకటన జారీచేసింది. హెచ్‌ఐజీ ప్లాట్లు 30 వేలానికి పెట్టింది. వాటి అప్‌సెట్ ధర గజం రూ.15,500గా నిర్ణయించింది. ఈ నెల 28 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తుంది. 31న వేలం నిర్వహిస్తుంది.

కైలాసగిరిపై నేచర్ కాటేజీల టెండర్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

మ్యూజియం ఈ నెలాఖరుకల్లా సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభిస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయ్యేలోగా ప్రతిపాదించిన 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

అనకాపల్లి జిల్లాలో రూ.175 కోట్ల విలువైన భూమి

గత ప్రభుత్వ హయాంలో పేదల కాలనీల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నుంచి రూ.175 కోట్లు ఖర్చు చేశామని, వాటి విలువకు సమానమైన భూమిని అనకాపల్లి జిల్లాలో ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం అక్కడి కలెక్టర్‌ను ఆదేశించిందని కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌లో సహకరించినందుకు రూ.790 కోట్ల విలువైన భూములను విశాఖ కలెక్టర్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే రూ.600 కోట్ల భూమిని ఇచ్చారన్నారు. ఆదాయం పెంచుకోవడానికి ప్లాట్ల వేలం ప్రక్రియ చేపట్టామన్నారు. మాస్టర్ ప్లాన్‌పై గతంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని, కొత్తగా అభ్యంతరాలను ఏప్రిల్ నుంచి స్వీకరిస్తామని, త్వరలో పారదర్శకమైన మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని కమిషనర్ విశ్వనాథన్ చెప్పారు. సముద్ర తీరం కోత నివారణకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు చేపడతామన్నారు. కొన్నిచోట్ల రక్షణ గోడల నిర్మాణం, 22 ప్రాంతాల్లో మొక్కల పెంపకం చేపడతామన్నారు.

బ్లడ్ బ్యాంకులు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

ప్రధాన కారణం వేసవి సెలవుల్లోనే కొన్ని ప్లాన్డ్ సర్జరీలు ఉంటాయి. దీనివల్ల అదనంగా వంద యూనిట్లు వరకు అవసరం అవుతాయి. అదే సమయంలో బ్లడ్ డొనేట్ చేసే వారి సంఖ్య తగ్గుతుంది. బ్లడ్ డొనేట్ చేసే వారిలో దాదాపు 70 శాతం మంది 30 ఏళ్లలోపు వారు ఉంటారు. మిగిలిన 30 శాతం 30 ఏళ్ల పైబడిన వారు ఉంటారు. వేసవిలో 40 ఏళ్లపైబడినవారు డొనేట్ చేసేందుకు ముందుకురారు. మరోవైపు విద్యార్థులు పరీక్షలు, ఇత్యాది కారణాల వల్ల ఫిబ్రవరి నెలాఖరు నుంచి బ్లడ్ డొనేట్ చేసేందుకు ముందుకురారు. ఒకవైపు అవసరానికి మించి డిమాండ్ పెరగడం, మరోవైపు ఆశించిన స్థాయిలో సేకరణ లేకపోవడం వల్ల కొరత ఏర్పడుతున్నట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

ముందుకురావాలి..

గర్భిణులు, ప్రమాద బాధితులు, తలసీమియా, ఎనీమియా వంటి సమస్యలతో బాధపడే వారికి రక్తం అవసరం అవుతుంటుంది. వారికి ఇబ్బందులు లేకుండా రక్తాన్ని సరఫరా చేయాలంటే దాతలు ముందుకు రావాలని బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు కోరుతున్నారు. ఒక్కో దాత నుంచి 350 నుంచి 450 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఏడాదికి కనీసం మూడు నుంచి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదాత నుంచి సేకరించిన రక్తం 35 రోజుల వరకు నిల్వ ఉంటుంది.

టెన్త్ పరీక్షలు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ నగరంలోని ప్రేమ ఎయిడెడ్, రాంనగర్‌లోని శ్రీచైతన్య స్కూలుతోపాటు మరికొన్ని పాఠశాలల్లో కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల పరిశీలకుడు దేవేంద్రరెడ్డి కొన్ని కేంద్రాలు తనిఖీ చేశారు. తొలిరోజు అరగంట ఆలస్యమైనా అనుమతించాలని విద్యా శాఖ ఇచ్చిన ఆదేశాలను అన్ని కేంద్రాల్లో అమలుచేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. కాగా ఓపెన్ స్కూలు పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 15 కేంద్రాల్లో జరిగాయి. తొలిరోజు హిందీ పరీక్షకు 57 మంది విద్యార్థులకు 49 మంది హాజరయ్యారు.

నకిలీ డీలర్ల వ్యవహారంపై జేసీ సీరియస్

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. దీంతో ఏళ్ల తరబడి డిపోలు నడుపుతున్న బినామీలు పలువురు ఒరిజినల్ డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారిని డిపోల వద్దకు తీసుకువచ్చి ఫొటోలు తీయిస్తున్నారు. నగరంలో అందుబాటులో లేని డీలర్లకు ఫోన్లు చేసి రప్పిస్తున్నారు. ఇదిలావుండగా ఒరిజినల్ డీలరుకు బదులు వేరొకరు ప్రతి నెలా సరకులు తీసుకున్న వ్యవహారంపై జేసీ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. శ్రీహరిపురం డిపో 290 డీలర్ మరణిస్తే కుటుంబంలో ఎవరికీ అవకాశం ఇవ్వలేదు. కనీసం నోటిఫికేషన్ జారీ చేసి డీలర్‌ను నియమించాల్సి ఉన్నా...అదేమీ లేకుండా మరొకరికి ఎలా ఇచ్చారో పౌర సరఫరాల అధికారులే చెప్పాలనే వాదన వినిపిస్తోంది. అలాగే మల్కాపురంలో ఒక డీలర్ వివాహం తరువాత విదేశాలకు వెళ్లగా ఆమె తండ్రి డిపో నిర్వహిస్తున్నారు. పెదవాల్తేర్ ప్రాంతంలో ఒక డీలరు ఆరు డిపోలు నిర్వహిస్తున్నారని, పూర్ణా మార్కెట్‌లో బియ్యం వ్యాపారి గుప్పిట్లో పలు డిపోలు ఉన్నాయని, వాటిపై జేసీ విచారణ చేయాలని కోరుతున్నారు.

గ్రామాల్లో సర్వేల తీరును పరిశీలించిన ఎంపీడీఓ

పద్మనాభం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ సర్వేలను ఎంపీడీఓ ఎం.విజయకుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. రేవిడి, కోరాడ, బీఆర్ తాళ్లవలస, రెడ్డిపల్లి గ్రామాలను సందర్శించారు. సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. పీ 4 సర్వే ద్వారా వర్క్ ఫ్రం హోం, ఎంఎస్ఎంఈ, ఆధార్ నమోదు కాని చిన్నారుల సమాచారం, తప్పిపోయిన పౌరుల వివరాల సేకరణ, జియో ట్యాగింగ్ సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఆదేశించారు.

టిప్పర్ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగిన కారణంగా విజయవాడ వైపు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున 4.20 గంటలకు అనకాపల్లి రావాల్సిన గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.00 గంటలకు చేరుకుంది. సికింద్రాబాద్-భువనేశ్వర్...విశాఖ ఎక్స్‌ప్రెస్ 4.30 గంటలకు బదులు 8.30 గంటలకు వచ్చింది. 5.50 గంటలకు రావాల్సిన గరీబ్‌రథ్ 9.30 గంటలకు, 5.20 గంటలకు రావాల్సిన చెన్నై-హౌరా మెయిల్ 10.20 గంటలకు, 7.10 గంటలకు రావాల్సిన గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ 10.30 గంటలకు, 7.20 గంటలకు రావాల్సిన కాకినాడ-విశాఖపట్నం రైలు 11.50 గంటలకు వచ్చాయి. ఇంకా 9.30 గంటలకు రావాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్ 12.15 గంటలకు, 9.20 గంటలకు రావాల్సిన బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటలకు, ఉదయం పదిన్నరకు రావాల్సిన విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు వచ్చాయి. అదేవిధంగా విశాఖ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. ఉదయం ఏడు గంటలకు విశాఖ నుంచి అనకాపల్లి రావాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ 9.15 గంటలకు, 7.50 గంటలకు రావాల్సిన విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 9.50 గంటలకు వచ్చాయి. ఇదిలావుండగా విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో విరిగిన సేఫ్టీ గడ్డర్‌ను రైల్వే సిబ్బంది సోమవారం సాయంత్రానికి పునరుద్ధరించారు.

నేటి నుంచి వెంకన్న ఆలయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇసుకతోట మహాలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయ సముదాయం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తామని సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు ఎస్.సిరిన్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఉంటాయన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పాత వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాల మేరకు.. పాత వెంకోజీపాలెం కాకంబ ఆలయం సమీపంలో ఉంటున్న బూటు సూరప్పడు పెద్ద కుమారుడు సంతోష్ (23) ఓ కళాశాలలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. ఇటీవల వరకు ఓ యువతితో సన్నిహితంగా ఉండేవాడు. ఆమెకు వివాహం కావడతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి నుంచి ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జె.మురళి పర్యవేక్షణలో హెచ్‌సీ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మటన్ దుకాణం వద్ద మేకల వధ

జరిమానా విధించిన అధికారులు



జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

వెంకోజీపాలెం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో మాంసాహారులు మటన్ కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో మటన్ దుకాణాల వద్దే మేకలను వధించి, వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు. కబేళాకు వెళ్లి, మేకలను వధించి, మాంసం తీసుకువచ్చి అమ్మే సమయం లేకపోవడంతో దుకాణాల వెనుక మేకలను వధిస్తున్నారు. గ్రేటర్ 15వ వార్డు హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో సోమవారం ఓ వ్యాపారి ఇష్టారాజ్యంగా మేకలను వధిస్తుండడంతో స్థానికులు నిలదీశారు. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ దుకాణం వద్దకు చేరుకుని జీవాలను తరలించాలని హెచ్చరించారు. మొదటితప్పుగా రూ.500 జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కబేళాలో కోసే మేకలకు పశు వైద్యులు పరీక్ష చేసి స్టాంపింగ్ వేస్తారు. అంటే ఆ మాంసం భయం లేకుండా తినవచ్చని నిర్ధారిస్తారు. కానీ ఇక్కడ దుకాణం వద్దనే మేకలను కోయడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళదుంపలు 16, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 40, అల్లం 50, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 28, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 54, కీరదోస 22, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	77
లైవ్ ధర	97
విత్ స్కిన్	164
స్కిన్‌లెస్	174



అభివృద్ధికి దూరంగా ఎంవీపీ కూడలిలోని పాత సర్కిల్



నిర్వహణ కరవై మొక్కలతో నిండిపోయిన సర్కిల్ లోపలి భాగం

ఎంవీపీ సర్కిల్ ఆధునికీకరణ కలేనా?

- దశాబ్దాలుగా నిర్వహణకు దూరం
- కళావిహీనంగా మారుతున్న వైనం
- వినతులిచ్చినా స్పందించని అధికారులు
- స్మార్ట్ సిటీలో భాగంగా అభివృద్ధి చేయాలని కోరుతున్న కాలనీ వాసులు

ఎంవీపీ కాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ సర్కిల్.. కాలనీకి ఐకాన్ లాంటిది. ఎంవీపీలో అనేక కూడళ్లలో సర్కిల్స్ నిర్మించినా, ఎంవీపీ సర్కిల్ అంటే నాలుగు రోడ్ల కూడలైన పాతదే గుర్తుకు వస్తుంది. పాత రోత, కొత్త మోత అన్నట్టు తర్వాత నిర్మించిన కూడళ్లకు రూ.కోట్లు స్మార్ట్ సిటీ నిధులు వెచ్చించి కొత్త హంగులు కల్పిస్తున్నారు. కానీ దశాబ్దాలుగా వెలుగొందుతున్న ఈ సర్కిల్‌ను మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అప్పుఘర్ బీచ్ రోడ్డును కలిపే ఎంవీపీ ప్రధాన రహదారిలో డీఆర్‌డీఏ, సమతా కళాశాల, పౌర గ్రంథాలయం, బీసీ స్టడీ సర్కిల్ తదితర కార్యాలయాలున్న చోట ఓ సర్కిల్‌ను గతంలో అభివృద్ధి చేశారు. చక్కని మొక్కలు వేసి పెంచారు. తర్వాత కాలంలో దీని నిర్వహణను గాలికి వదిలేశారు. మధ్యలో విద్యుత్ స్తంభం వేసి, ఆ కిందనే సరఫరాకు సంబంధించిన ఓ బాక్సును కూడా ఏర్పాటుచేశారు. తర్వాత మొక్కలు, గడ్డి పెంపకం తదితర అంశాలపై దృష్టి సారించకపోవడంతో కళావిహీనంగా మారింది.

ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ఈ సర్కిల్ కీలకం. ఏదైనా సందర్భం వస్తే ఈ సర్కిల్‌ను ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. ఎవరికైనా స్వాగతం, జన్మదిన శుభాకాంక్షలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు వంటి వాటికి పెద్ద సైజు ఫ్లెక్సీలను సర్కిల్‌లో పెడుతున్నారు. వాస్తవానికి ఈ భారీ ఫ్లెక్సీల వల్ల ట్రాఫిక్‌కు సైతం ఇబ్బంది అవుతోంది. ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వ్యాపార కూడలిగా మారింది. వీటిని నివారించాలంటే తక్షణం సర్కిల్‌ను ఆధునికీకరించాలి. సర్కిల్‌ను కొద్దిగా తగ్గించడం వల్ల రహదారి వెడల్పుగా మారుతుంది. ఈ సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దాలని స్థానికుల నుంచి ఏళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన దాఖలాలు ఉన్నాయి. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు కనీసం స్పందించడం లేదు. ఇప్పటికైనా ఎంవీపీ సర్కిల్‌కు స్మార్ట్ సిటీ నిధులను కేటాయించి, అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలి

ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి

ఆరిలోవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో మెలగాలని ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పిలుపునిచ్చారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సోమవరం పెదగదిలి ఎర్ని దుర్గమాంబ ఫంక్షన్ హాల్లో ఆరిలోవ సీఐ హెచ్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బార్‌అండ్ రెస్టారెంట్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటల్స్‌లో గదులు అద్దెకు ఇచ్చినపుడు సంబంధిత వ్యక్తుల వివరాలు సేకరించాలని, వారి ప్రవర్తనపై అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేర నియంత్రణలో పోలీసులకు పూర్తిగా సహకరించాలని, బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ద్వారకా సీఐ డి.వెంకటరమణ, ఆరిలోవ ఎస్‌ఐ పీడీబీ శంకర్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు



తోటగరువు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఆరిలోవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులంతా తల్లిదండ్రులతో కలిసి కేంద్రాలకు వచ్చారు. పాఠశాలల్లో నోటీసు బోర్డులను దూరంగా ఉంచడంతో కొంత అసౌకర్యానికి గురయ్యారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా పోలీసులు సహకరించారు. ఆరిలోవలోని ఎ సెంటర్‌కు 187 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. అదేవిధంగా బి సెంటర్‌కు 278 మంది విద్యార్థులకు గాను ఇద్దరు రాలేదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించింది. శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో 200 మంది పరీక్షలు రాశారు. ఓపెన్ స్కూలు పరీక్షలను మొదటి రోజు ముగ్గురు విద్యార్థులకు కేటాయించగా, ముగ్గురూ హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. ఇక్కడ విద్యార్థులకు చేసిన ఏర్పాట్లపై అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు.

పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలతో అనుసంధానం కావాలి

- ఏయూ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థులకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఏడీ డాక్టర్ విజయకుమార్ పిలుపు

వెంకోజీపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫార్మా పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలతో అనుసంధానం కావాలని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయకుమార్ అన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల 74వ వార్షికోత్సవాన్ని బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో ఉండే కాలాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏయూలో అందుబాటులో ఉన్న డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయాన్ని నిరంతరం సందర్శించడం, అక్కడ విలువైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఔషధాల తయారీ, నాణ్యత, పరిశోధన, క్లినికల్ ట్రైల్స్ రెగ్యులేషన్స్, సప్లై చైన్ తదితర విభిన్న విభాగాలలో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి బానిసలు అయితే జీవితం నాశనం అవుతుందని వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో కూడా ఐటీ, ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటివి అంతర్భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్మా రంగంలో అపారమైన డేటా ఉందని, దీనిని విశ్లేషిస్తే మంచి ఫలితాలు పొందడం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్, ఆచార్య వి.గిరిజాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'



నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నేతలు

సిరిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు జర్నలిస్టులకు ప్రభుత్వం నాలుగు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పలు జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చించి జర్నలిస్టుల సంక్షేమానికి రూ.150 కోట్లు కేటాయించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రూ.10వేలు చొప్పున పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధించాలని కోరారు. అలాగే, జర్నలిస్టులపై దాడులు, అవమానాలు, తప్పుడు కేసులు నమోదవుతున్నాయని వాటి నివారణకు తక్షణమే హై పవర్ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. అం తరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఏ అధ్యక్షుడు పి.సత్యనారా యణ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాము, రామచంద్రరావు, మోహన్, పరశురామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు మూడు రోజుల్లోగా పరిష్కారం చూపండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మేయర్ హరి వెంకటకుమారి



సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ హరికుమారి

వెంకోజీపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలకు మూడు రోజుల్లో పరి ష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలను స్వీకరించడంతో పాటు వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 86 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు.

వీఎంఆర్డీఏలో...

సిరిపురం : వీఎంఆర్డీఏలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హాజరై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి మొత్తం 23 అర్జీలు అందినట్టు వివరించారు. వీటన్నింటిపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా సూచించారు. జేసీ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇంతటి ఘన విజయాన్ని ఊహించలేదు

- 'కోర్టు' సినిమా దర్శకుడు రామ్‌జగదీష్
- నగరంలో చిత్ర యూనిట్ సందడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర బృందం

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ నేపథ్యంలో చట్టంపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన 'కోర్టు' చిత్రం ఇంతటి ఘనవిజయం సాధిస్తుందని ఊహించలేదని కథా రచయిత, యువ దర్శకుడు రామ్‌జగదీష్ అన్నారు. విశాఖలోని సీతంపేటకు చెందిన యువ దర్శకుడు రామ్‌జగదీష్ దర్శకత్వంలో నాని నిర్మాతగా, నూతన నటులు చంద్రశేఖర్, రోషిక హీరో హీరోయిన్లుగా ప్రధాన పాత్రలలో శివాజీ, ప్రియదర్శన్‌లు నటించిన 'కోర్టు' చిత్ర యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా సోమవారం విశాఖలో విజయోత్సవ ప్రచారం ప్రారంభించింది. పలు థియేటర్లకు వెళ్లి ప్రేక్షకులతో కలసి సందడి చేసింది. ఈ సందర్భంగా హోటల్ దసపల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విడుదలైన మూడు రోజుల్లోనే సుమారు రూ.25 కోట్ల రికార్డు కలెక్షన్లు సాధించిందని ప్రకటించారు.విశాఖ పాలిటెక్నిక్‌లో చదువుకున్నానని దర్శకుడు రామ్‌జగదీష్ తెలిపారు. 'కోర్టు' సినిమా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా చూడాలని నటులు శివాజీ, ప్రియదర్శన్ అన్నారు. ఆకట్టుకునే కథను రాసి ఈ సినిమాకు దర్శకత్వం వహించిన రామ్‌జగదీష్ ప్రతిభను గుర్తించి ప్రముఖ హీరో నాని నిర్మాతగా ముందుకొచ్చారని తెలిపారు. పసి హృదయాల ప్రేమ కథగా తెరకెక్కించాడని ఇందులో తగరపువలస మంగపతిగా సమాజానికి ఉపయోగపడే పాత్ర పోషించానన్నారు. సమావేశంలో హీరో, హీరోయిన్లు చంద్రశేఖర్, రోషికా, న్యాయవాదిగా నటించిన ప్రియదర్శన్, శ్రీదేవి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో 'కోర్టు' చిత్ర బృందం

సింహాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోర్టు సినిమా కథానాయకుడు ప్రియదర్శి, నాయిక శ్రీదేవి అప్పల తదితరులు సోమవారం అప్పన్నను దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం, అంతరాలయంలో పూజల తరువాత పండితులు వేదాశీస్సులీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు. నటులు శివాజీ, హర్షరోషన్, దర్శకుడు రామ్‌జగదీష్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు

- ప్రభుత్వానికి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిఫారసు
- కమిషన్ సభ్యులు సీతారాం వెల్లడి
- కేఆర్ఎం కాలనీలోని 'అంగన్‌వాడీ' కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రం రోస్టర్ బుక్ పరిశీస్తున్న సీతారాం

వెంకోజీపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సొంత స్థలాలు ఉన్న చోట అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టా లని తమ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఐసీడీఎస్ సెక్టార్ -2 కేఆర్ఎం కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. తక్కువ ఎత్తు, బరువు ఉన్న పిల్లలకు ఎటువంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు, గత ఏడాదిలో ఉన్న మొత్తం పిల్లల్లో ఆడ, మగ పిల్లల సంఖ్య ఎంత, గర్భిణులు, బాలింతల్లో ఎంతమందికి పౌష్టికాహారాన్ని అందుస్తున్నారు.. తదితరాలను అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి ద్వారా తెలుసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో తాను ఈ పర్యటనలు జరుపుతున్నట్టు ఆయన వివరించారు.

గాయపడిన ఉక్కు కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వైర్‌రాడ్ మిల్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం ఆస్పత్రిలో మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీప రామన్నపాలేనికి చెందిన టి.నర్సింగరావు (34) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి విధులకు హాజరైన ఆయన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్టాపర్ చెకింగ్ చేస్తుండగా సుమారు ఏడు అడుగుల ఎత్తు పైనుంచి కింద పడిపోయిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మల్కాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి షాపు మూశాక తాళాలు వేసి సూపర్‌వైజర్ ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం వచ్చి చూసేసరికి సీలింగ్‌కు రంధ్రం పడి ఉండడంతో షాప్ యజమాని ఆందోళనకు గురయ్యాడు. షాపులోని ఖరీదైన మద్యం బాటిళ్లతో పాటు క్యాష్ బాక్సులో ఉంచిన సుమారు రూ.లక్ష చోరీకి గురైనట్టు గుర్తించి మల్కాపురం క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ ఎస్‌ఐ రమణ, హెచ్‌సీ ఖాసీమ్, తదితరులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత సేవలు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను కేంద్రాలకు ఉచితంగా తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. జిల్లాలో 150 సర్వీసులు నడపాలని భావించినప్పటికీ, 100 బస్సులు మాత్రమే ఆపరేట్ చేసింది. ఉదయం 7 నుంచి 9.30, మధ్యాహ్నం ఒంటి నుంచి మూడు గంటల వరకు సేవలందించాయి. ఏడు డిపోల మేనేజర్లు, ద్వారకా బస్‌స్టేషన్ మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, ఆర్ఎం అప్పలనాయుడు బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు.

జీవీఎంసీ ప్రాజెక్టులకు ఐఏఎస్‌ల ప్రశంసలు



జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఐఏఎస్‌ల బృందం

వెంకోజీపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిపాలన విధానం, ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని ట్రైనీ ఐఏఎస్‌ల గ్రూప్ లీడర్ రక్షన్ పాంట్ మారక్ కితాబునిచ్చారు. మధ్యప్రదేశ్, సిక్కిం, గుజరాత్, మేఘాలయ తదితర రాష్ట్రాల నుంచి 126వ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాం గ్రూప్-05 సివిల్ సర్వీసెస్ నుంచి ఐఏఎస్‌లోనికి పదోన్నతిపై వచ్చిన 19 మంది ట్రైనీ ఐఏఎస్‌లు సోమవారం జీవీఎంసీ కార్యాలయాన్ని సందర్శిం చారు. ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ యంత్రాంగం చేపడుతున్న పరిపాలన, పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులను ఆయా శాఖాధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులు, ప్రజలకు అందించే తాగునీరు, మురుగు నీటి శుద్ధి కర్మాగారం, పార్కులు, వ్యర్థాల నుంచి విద్యుత్తు, ఎరువు, బ్రిక్స్ తయారీ విధానం, బస్ బే, వీధి దీపాల నిర్వహణ, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఫ్లోటింగ్ సోలార్ సిస్టం, ఇండోర్- ఔట్‌డోర్ స్టేడియాలు, పారిశుధ్య నిర్వహణ, క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ, రాత్రి పారిశుధ్య పనులు, మొక్కల నిర్వహణ, పార్కులు, టౌన్ ప్లానింగ్ రెవెన్యూ, యూసీడీ తదితర విభాగాల పనితీరును ఆయా శాఖాధిపతులు క్లుప్తంగా వివరించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఈప్రాజెక్టులు చాలా బాగున్నాయని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, డీపీవో ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్.రవి, రాజేంద్ర కృష్ణ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ ఏడుకొండలు, డీసీపీ హరిదాసు, చార్టెడ్ అకౌంటెంట్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన ఐఏఎస్ అధికారులు

విశాఖపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సేవల నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌కు పదోన్నతి పొందిన వివిధ రాష్ట్రాల అధికారుల బృందం సోమవారం పోర్టును సందర్శించింది. పోర్టులో మౌలిక వసతుల కల్పన, యాంత్రీకరణ సామర్థ్యాలను ఇక్కడి అధికారులు వారికి వివరించారు. కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, కవర్డ్ స్టోరేజీ సదుపాయాలు, సోలార్ పవర్ ప్లాంట్, నీటి శుద్ధి పునర్వినియోగం, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, ఎగుమతులు, దిగుమతుల కార్యకలాపాలను వివరించారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి: వంశీకృష్ణ


అసెంబ్లీలో మాట్లాడుతున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై అనేక పరిశ్రమలు, ప్రజలు ఆధారపడి ఉన్నారన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్‌ప్లాంట్ ప్రారంభమైన చారిత్రక అంశాన్ని ఆయన గుర్తు చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ఆయన మాట్లాడారు. అమృతరావు, తెన్నేటి విశ్వనాథం వంటి అనేకమంది కృషి, త్యాగాల ఫలమే విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సంక్షోభానికి గత వైసీపీ ప్రభుత్వం అవలంబించిన విధానాలే కారణమని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు.

బధిర విద్యార్థులకు సైన్ లాంగ్వేజ్ సెల్‌ఫోన్లు


సెల్‌ఫోన్లు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సైన్ లాంగ్వేజ్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు విభిన్న ప్రతిభావంతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్‌ఫోన్లను అందించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తన కార్యాలయంలో సైన్ లాంగ్వేజ్ యాప్‌తో కూడిన సెల్‌ఫోన్లను అందించారు. విద్యార్థులు వీటిని వినియోగించుకుని చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

కంచరపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐని ఆనుకుని ఉన్న నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 21న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ మేళాలో ఎస్ఆర్ అకాడమిక్ ఆర్గనైజేషన్స్, శ్రీరాం చిట్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొని పలు ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఫ్రంట్ ఆఫీస్, జీఏన్ఎం, మార్కెటింగ్ స్టాఫ్ తదితర ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.1.3 లక్షల నుంచి రూ.2.4 లక్షలు ఉంటుందన్నారు. పది, ఇంటర్, బీఎస్సీ నర్సింగ్, డిగ్రీ తదితర అర్హతలున్నవారు మేళాలో పాల్గొనవచ్చు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాంసుందర్ కోరారు.

స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యం: టూటౌన్ సీఐ


యర్రంనాయుడు

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ సీఐగా నియమితులైన వీసీఎం యర్రనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన తిరుమలరావు బదిలీ కావటంతో సిటీ క్రైమ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న యర్రంనాయుడును నియమించారు. స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

టెన్త్ పరీక్షలు ప్రారంభం

.. 5వ పేజీ తరువాయి

చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ నగరంలోని ప్రేమ ఎయిడెడ్, రాంనగర్‌లోని శ్రీచైతన్య స్కూలుతోపాటు మరికొన్ని పాఠశాలల్లో కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల పరిశీలకుడు దేవేంద్రరెడ్డి కొన్ని కేంద్రాలు తనిఖీ చేశారు. తొలిరోజు అరగంట ఆలస్యమైనా అనుమతించాలని విద్యా శాఖ ఇచ్చిన ఆదేశాలను అన్ని కేంద్రాల్లో అమలుచేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. కాగా ఓపెన్ స్కూలు పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 15 కేంద్రాల్లో జరిగాయి. తొలిరోజు హిందీ పరీక్షకు 57 మంది విద్యార్థులకు 49 మంది హాజరయ్యారు.

టెన్త్ పరీక్షకు శతశాతం విద్యార్థులు హాజరు


పదో తరగతి పరీక్ష ప్రారంభానికి ముందు ఎస్ఎంసీహెచ్ పాఠశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


ఎన్‌జీజీఓస్ కాలనీలోని ఎంపీఎల్ ఉన్నత పాఠశాల వద్ద హాల్ టిక్కెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం/సీతమ్మధార, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష సోమవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటలకే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఎలక్ర్టానిక్ వస్తువులు లోపలకు తీసుకొని వెళ్లకుండా విద్యార్థులను తనిఖీ చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల, లలితానగర్‌లోని జ్ఞాననికేతన్ పాఠశాల, రైల్వేన్యూకాలనీలోని కేఎన్ఎం బాలికల ఉన్నత పాఠశాల, అందులోనే ఉన్న జీవీఎంసీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. అన్ని కేంద్రాల్లో శతశాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్లు మాణిక్యం, కె.రాము, జి.సన్యాసిరావులు తెలిపారు. విద్యార్థులు పరీక్ష రాసి బయటకు వచ్చే వరకు సమీప ప్రాంతాల్లో తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు నిరీక్షించారు. సీతమ్మధార ప్రాంతంలోని ఎస్ఎంసీహెచ్, మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయం కంటే ముందుగానే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి చేరుకున్నారు. పరీక్షను ఏ గదిలో రాయాలో కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన నోటీస్ బోర్డులో తమ హాల్ టికెట్ నెంబర్లు చూసుకున్నారు. ఎటువంటి ఆందోళనకు గురికాకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

సమస్యలపై రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ధర్నా


డీఆర్ఎం లలిత్ బొహ్రాకు వినతిపత్రం అందజేస్తున్న శ్రామిక్ కాంగ్రెస్ ప్రతినిధులు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ కాంగ్రెస్ వాల్తేరు డివిజన్ శాఖ సోమవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలో ధర్నా నిర్వహించింది. యూనియన్ నాయకులు సంపత్‌కుమార్, ఆర్.సి.సాహు, టి.వి.మౌళి మాట్లాడుతూ యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) లోపాలు, ప్రతికూల అంశాలను సరిదిద్ది ప్రతి ఉద్యోగి పెన్షన్ ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లోని ఉద్యోగ ఖాళీలను సరెండర్ చేసే విధానాన్ని విరమించుకోవాలని, నియామకాలపై నిషేధం ఎత్తివేసి రైల్వే విస్తరణకు అనుగుణంగా కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం సిబ్బంది నియామకం జరగాలని, పెండింగ్‌లో ట్రాక్ మెయింటెయినర్ల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలన్నారు. రనింగ్ సిబ్బందికి కిలోమీటర్ అలవెన్స్ పెంచాలని, ఆదాయ పన్ను పరిధి 70 శాతం మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైల్వే కాంట్రాక్టరైజేషన్ పద్ధతి, అవుట్ సోర్సింగ్ నియామకాలను నిలిపివేయాలన్నారు. బోనస్ చెల్లింపునకు సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని, 12 గంటలు బదులు ఎనిమిది గంటల విధుల నిర్వహణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డీఏ, డీఆర్‌లను విడుదల చేయాలని, ట్రాక్ మెయింటెయినర్లకు లెవెల్-6 జీపీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఆర్ఎం లలిత్ బొహ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు, బ్రాంచి కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రజలకు మౌలిక వసతులు కల్పించరూ!


కలెక్టరుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో పేదలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చొరవచూపాలని ఆ వార్డు కార్పొరేటర్ గంకల కవిత కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులో అధిక శాతం నిరుపేదలు నివాసం ఉంటున్నారని, వీరు ఎటువంటి శుభకార్యాలు నిర్వహించుకోవాలన్నా కల్యాణ మండపం లేదని పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బంది అవసరానికి సరిపడా లేరని, వారిని నియమించాలన్నారు. వార్డులో పారిశుధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో లేరన్నారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు చేయూత అందించాలని అభ్యర్థించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కలిసిన కవిత వార్డు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు.

దూదేకులను బిసి-బిలో చేర్చాలి

మాధవధార: ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన కులగణనలో ముస్లింలోని ఓ వర్గమైన దూదేకుల్ని బీసీ-బి' బదులు బీసీ-ఇ కేటగిరీలో తప్పుగా చేర్చారని దూదేకుల ముస్లిం సంఘం విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ బాబ్జీ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ ఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. డాటా ఎంట్రీలో జరిగిన తప్పిదంతో మొత్తంగా రిజర్వేషన్ విధానంపై ప్రభావం చూపుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముస్లిం వర్గాలు ఎదుర్కొంటున్న ఈద్‌గా కేటాయింపు, ఇతర సమస్యలపై లిఖిత పూర్వకంగా ముస్లిం వర్గాలతో కలసి వినతిపత్రం అందించారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణకు నిరసనగా ఉద్యమ కార్యాచరణ

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్సు యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పద్మరాజు మాట్లాడుతూ విశాఖ పోర్టు అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో రెండోసారి టెండర్లు పిలిచారని, ఏప్రిల్ 19 వరకు గడువు ఇచ్చి, 21న టెండర్లు తెరుస్తామని ప్రకటించడం ద్వారా కార్మికుల ఆరోగ్య భద్రతను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. టెండరు ప్రక్రియను తక్షణమే నిలిపివేసి ప్రైవేటీకరణను తక్షణమే రద్దు చేయకపోతే మార్చి 18 నుంచి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మంగళవారం పోర్టు ప్రాంగణంలో గేటు వద్ద సమావేశాలు, 24 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించడం, ఏప్రిల్ 1 నుంచి ఉద్యోగుల నివాస ప్రాంతాల వద్ద నిరసనలు, ఏప్రిల్ 9న ఉదయం 10 గంటలకు 'చలో ఏవోబీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేవరకు పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు సమష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వర రావు, జి.సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 56 మందికి ఉద్యోగాలు


నియామక పత్రాలతో విద్యార్థినులు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రాంగణ నియామక ఉద్యోగ మేళా జరిగింది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, నిర్మాణ్, ఫాక్స్‌కాన్ సంస్థ (హైదరాబాద్) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు విద్యార్థినులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఫాక్స్‌కాన్ కంపెనీ నుంచి హెచ్ఆర్‌లు జి.హరిణి, ప్రవీణ్‌కుమార్, నిర్మాణ్ సంస్థ నుంచి ఎం.మహేష్, వేణుగోపాల్ మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ప్లేస్‌మెంట్ జేకేసీ కో-ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన మాట్లాడుతూ 145 మంది విద్యార్థినులు హాజరుకాగా, 58 మంది ఉపాధి అవకాశాలు పొందారని తెలిపారు. వివిధ అంశాలలో నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందే దిశగా ముందుకు వెళ్లాలని విద్యార్థినులకు వారు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, బోటనీ ఇన్‌చార్జి డాక్టర్ టి.ఎం.నివేదిత, మెంటర్స్ వి.ఎస్.రాజు, డి.ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ టోర్నీకి ఏయూ జట్టు


జట్టు సభ్యులతో ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఏయూ జట్టు సభ్యులను సోమవారం ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే ఈ టోర్నీలో పురుషుల విభాగంలో 12 మంది, మహిళల కేటగిరీలో ముగ్గురు ప్రాతినిధ్యం వహిస్తారు. పురుషుల విభాగంలో బి.నితిన్‌కుమార్, కె.కుందన్‌కుమార్, కె.పృధ్వీరాజ్, ఎస్.మురళి, ఎస్.కె.రెహ్మాన్, ఎం.ఆకాష్‌కుమార్, ఎస్.గణేష్, టి.అభయ్‌కుమార్, కె.శ్రావణ్, పి.వెంకట హేమంత్‌కుమార్, బి.సూరత్, టి.జగది...మహిళల విభాగంలో బి.కల్పిత, ఎం.అంజుశ్రీ, జి.శాయి దివ్య ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టు మేనేజర్‌గా జి.ఆనందబాలు, కోచ్‌గా వి.జోగారావు వ్యవహరిస్తారు. జట్టు సభ్యులను ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ సోమవారం తన కార్యాలయంలో అభినందించి ఏయూకు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఇంతటి ఘన విజయాన్ని ఊహించలేదు

» కోర్టు చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్

» విశాఖలో కోర్టు చిత్ర యూనిట్ సందడి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నటుడు శివాజీ చిత్రంలో దర్శకుడు రామ్ జగదీష్, హీరో హీరోయిన్లు తదితరులు

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ నేపథ్యంలో చట్టంపై అవగాహన కల్పిస్తూ నేటి యువత చేస్తున్న తప్పును వారికి అర్థమయ్యేలా రూపొందించిన 'కోర్టు' చిత్రం విజయం సాధిస్తుందని ముందుగా అనుకున్నానని, కానీ ఇంతటి ఘనవిజయం సాధిస్తుందని ఊహించలేదని ఈ సినిమా కథా రచయిత, యువ దర్శకుడు రామ్‌జగదీష్ అన్నారు. అందరూ అభినందనలతో ప్రశంసిస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖలోని సీతంపేటకు చెందిన యువ దర్శకుడు రామ్‌జగదీష్ దర్శకత్వంలో నాని నిర్మాతగా, నూతన నటులు చంద్రశేఖర్, రోషిక హీరో హీరోయిన్లుగా ప్రధాన పాత్రలలో శివాజీ, ప్రియదర్శన్‌లు నటించిన 'కోర్టు' చిత్ర యూనిట్ తమ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం విశాఖలో విజయోత్సవ ప్రచారం ప్రారంభించింది. పలు థియేటర్లకు వెళ్లి ప్రేక్షకులతో కలసి సందడి చేసింది. ఈ సందర్భంగా హోటల్ దసపల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ ఈ చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే సుమారు రూ.25 కోట్ల రికార్డు కలెక్షన్లు సాధించిందని ప్రకటించారు. తాను సీతంపేటలో నివాసముంటూ విశాఖ పాలిటెక్నిక్‌లో చదువుకున్నానని దర్శకుడు రామ్‌జగదీష్ తెలిపారు. 'కోర్టు' సినిమా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా చూడాలని నటులు శివాజీ, ప్రియదర్శన్‌లు అన్నారు. ఆకట్టుకునే కథను రాసి ఈ సినిమాకు దర్శకత్వం వహించిన రామ్‌జగదీష్ ప్రతిభను గుర్తించి ప్రముఖ హీరో నాని ఈ చిత్రానికి నిర్మాతగా ముందుకొచ్చారని తెలిపారు. ప్రేక్షకులను ఆకటుకునేలా రెండు పసి హృదయాల ప్రేమ కథగా తెరకెక్కించాడని శివాజీ అన్నారు. ఇందులో తగరపువలస మంగపతిగా సమాజానికి ఉపయోగపడే పాత్ర పోషించానని, రక్తపాతం లేని కమర్షియల్ సినిమా అని పేర్కొన్నారు. చదువు రాకపోయినా, చట్టం అందరికీ తెలియాలని ఈ చిత్రం సూచిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో హీరో, హీరోయిన్లు చంద్రశేఖర్, రోషికా, న్యాయవాదిగా ప్రధాన పాత్ర పోషించిన ప్రియదర్శన్, శ్రీదేవి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో 'కోర్టు' చిత్ర బృందం

సింహాచలం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోర్టు సినిమా నటీనటులు సోమవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. కథానాయకుడు ప్రియదర్శి, నాయిక శ్రీదేవి అప్పల తదితరులు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీస్సులీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అప్పన్నను దర్శించుకున్న వారిలో నటులు శివాజీ, హర్షరోషన్, దర్శకుడు రామ్‌జగదీష్ తదితరులున్నారు.

కైలాసగిరిపై నేచర్ కాటేజీల టెండర్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

మ్యూజియం ఈ నెలాఖరుకల్లా సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభిస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయ్యేలోగా ప్రతిపాదించిన 15 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

అనకాపల్లి జిల్లాలో రూ.175 కోట్ల విలువైన భూమి

గత ప్రభుత్వ హయాంలో పేదల కాలనీల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నుంచి రూ.175 కోట్లు ఖర్చు చేశామని, వాటి విలువకు సమానమైన భూమిని అనకాపల్లి జిల్లాలో ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం అక్కడి కలెక్టర్‌ను ఆదేశించిందని కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌లో సహకరించినందుకు రూ.790 కోట్ల విలువైన భూములను విశాఖ కలెక్టర్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే రూ.600 కోట్ల భూమిని ఇచ్చారన్నారు. ఆదాయం పెంచుకోవడానికి ప్లాట్ల వేలం ప్రక్రియ చేపట్టామన్నారు. మాస్టర్ ప్లాన్‌పై గతంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని, కొత్తగా అభ్యంతరాలను ఏప్రిల్ నుంచి స్వీకరిస్తామని, త్వరలో పారదర్శకమైన మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని కమిషనర్ విశ్వనాథన్ చెప్పారు. సముద్ర తీరం కోత నివారణకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు చేపడతామన్నారు. కొన్నిచోట్ల రక్షణ గోడల నిర్మాణం, 22 ప్రాంతాల్లో మొక్కల పెంపకం చేపడతామన్నారు.

టిప్పర్ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

అండర్ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగిన కారణంగా విజయవాడ వైపు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున 4.20 గంటలకు అనకాపల్లి రావాల్సిన గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.00 గంటలకు చేరుకుంది. సికింద్రాబాద్-భువనేశ్వర్...విశాఖ ఎక్స్‌ప్రెస్ 4.30 గంటలకు బదులు 8.30 గంటలకు వచ్చింది. 5.50 గంటలకు రావాల్సిన గరీబ్‌రథ్ 9.30 గంటలకు, 5.20 గంటలకు రావాల్సిన చెన్నై-హౌరా మెయిల్ 10.20 గంటలకు, 7.10 గంటలకు రావాల్సిన గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ 10.30 గంటలకు, 7.20 గంటలకు రావాల్సిన కాకినాడ-విశాఖపట్నం రైలు 11.50 గంటలకు వచ్చాయి. ఇంకా 9.30 గంటలకు రావాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్ 12.15 గంటలకు, 9.20 గంటలకు రావాల్సిన బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటలకు, ఉదయం పదిన్నరకు రావాల్సిన విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు వచ్చాయి. అదేవిధంగా విశాఖ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు కూడా ఆలస్యంగా నడిచాయి. ఉదయం ఏడు గంటలకు విశాఖ నుంచి అనకాపల్లి రావాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ 9.15 గంటలకు, 7.50 గంటలకు రావాల్సిన విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 9.50 గంటలకు వచ్చాయి. ఇదిలావుండగా విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో విరిగిన సేఫ్టీ గడ్డర్‌ను రైల్వే సిబ్బంది సోమవారం సాయంత్రానికి పునరుద్ధరించారు.

మేయర్‌పై అవిశ్వాసం?

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. ఈ మేరకు విజయవాడలో సోమవారం సీఎంతో ఎమ్మెల్యేలు చర్చించినట్టు తెలిసింది. వారి ఆదేశం మేరకు టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్లారు. సీఎం, డిప్యూటీ సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత బుధ, గురువారాల్లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కలెక్టర్‌కు నోటీసు అందజేసే అవకాశం ఉంది.

కూటమి, వైసీపీ నేతల వ్యూహ ప్రతివ్యూహాలు

కొత్త మేయర్ ఎన్నికకు కావాల్సిన సంఖ్యాబలం కూటమికి ఉన్నప్పటికీ, వైసీపీకి చెందిన కార్పొరేటర్లను మరింతమందిని చేర్చుకోవాలని టీడీపీ, జనసేన నేతలు వ్యూహరచన చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, పశ్చిమంలోని మరో కార్పొరేటర్ మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. తర్వాత మరికొందరు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలో చేరిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. మరోవైపు వైసీపీ కూడా కూటమి వ్యూహాలను తిప్పికొట్టే పనిలో పడింది. అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు ఇస్తే ఏం చేయాలి?, అవిశ్వాసం తీర్మానానికి అనుకూలంగా తమ పార్టీ సభ్యులు వ్యవహరిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది?, కూటమి ఎత్తులు పారకుండా చట్టపరంగా అందుబాటులో ఉన్న అవకాశాలపై చర్చించేందుకు ఆ పార్టీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, తైనాల విజయ్‌కుమార్, మరికొందరు సోమవారం రాత్రి సమావేశమయ్యారు. పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు సమక్షంలో పార్టీ కార్పొరేటర్లతో మంగళవారం మరోమారు సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. వైసీపీ, కూటమి నేతల వ్యూహప్రతివ్యూహాలతో జీవీఎంసీ రాజకీయాలు వేడెక్కాయి.

దాకమర్రి లేఅవుట్‌లో ప్లాట్ల ధరల తగ్గింపు

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్లు వేసిన ప్రైవేటు డెవలపర్లు వారి భూముల ధరలు పెంచుకోవడానికి వ్యూహాత్మకంగా వారి మనుషులను వేలం పాటకు పంపించి అధిక ధరలకు పాడించేశారు. అక్కడ అప్పట్లో ప్రైవేటు లేఅవుట్‌లో గజం ధర రూ.4 వేలు ఉండగా వుడా వేలంలో గజం రూ.16,500కు పాడేశారు. మంచి రేటు వచ్చిందని అధికారులు సంబర పడ్డారు. అయితే ఆ రేటుకు కేవలం రెండు ప్లాట్లే అమ్ముడుపోయాయి. వుడాలో ఓ నిబంధన ఉంది. ఒకసారి వేలం పాటలో ఏ ధరకు విక్రయిస్తారో ఆ తరువాత నిర్వహించిన వేలంలో దానినే అప్‌సెట్ ధరగా నిర్ణయించి, ఆ రేటు లేదా అంతకంటే ఎక్కువకు అమ్మాలి. ఆ రేటు కంటే తక్కువకు ఇవ్వడానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో మిగిలిన ప్లాట్లను అమ్మడానికి మళ్లీ వుడా వేలం నిర్వహించగా రెండో సారి ప్రైవేటు డెవలపర్లు గజం రూ.21 వేలకు పాడేశారు. అప్పుడు ఒక్క ప్లాటే ఆ ధరకు వెళ్లింది. అదే సమయంలో దాకమర్రి పరిసరాల్లో వుడా రేటులో సగం ధరకే తాము ప్లాట్లు ఇస్తామంటూ ప్రైవేటు డెవలపర్లు వారి లేఅవుట్లలో గజం రూ.10వేలు చొప్పున అమ్ముకొని భారీగా లాభపడ్డారు. ఆ తరువాత వీఎంఆర్‌డీఏ సుమారుగా ఎనిమిది సార్లు దాకమర్రి ప్లాట్లు వేలానికి పెట్టింది. అప్‌సెట్ ధర గజం రూ.21 వేలు పెట్టడం వల్ల కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. కనీసం ఎవరూ దరఖాస్తు కూడా చేయలేదు. ఎందుకిలా జరుగుతోందని అధికారులు ఆరా తీశారు. అప్పుడు వాస్తవాలు తెలిశాయి. బయట మార్కెట్ ధర కంటే వీఎంఆర్‌డీఏ రేటు ఎక్కువగా ఉందని, ఆ రేటు ఉన్నంత కాలం ఎవరూ ముందుకు రారని తెలుసుకొని దానిని తగ్గించడానికి చర్యలు చేపట్టారు.

రెండు నెలల కసరత్తు

వీఎంఆర్‌డీఏ నచ్చినట్టు రేట్లు తగ్గించడం కుదరదు కాబట్టి దీనిపై నిర్ణయం కోసం ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇక్కడి కమిషనర్ విశ్వనాథన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మార్కెట్ విలువ, బయట అమ్మకం ధరలు తెప్పించి, పరిస్థితిని వివరిస్తూ లేఖ రాశారు. దాంతో ధర నిర్ణయానికి కమిటీని వేశారు. జీవీఎంసీ కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఇలా అంతా కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంత వరకు తగ్గించవచ్చునో సూచిస్తూ నివేదిక పంపారు. దాంతో గజం రూ.21 వేలు ఉన్న ధరను రూ.15,500కు విక్రయించాల్సిందిగా ఆదేశాలు రావడంతో ఈ నెల మొదటివారంలో వీఎంఆర్‌డీఏ ప్రకటన జారీచేసింది. హెచ్ఐజీ ప్లాట్లు 30 వేలానికి పెట్టింది. వాటి అప్‌సెట్ ధర గజం రూ.15,500గా నిర్ణయించింది. ఈ నెల 28 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తుంది. 31న వేలం నిర్వహిస్తుంది.

నకిలీ డీలర్ల వ్యవహారంపై జేసీ సీరియస్

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. దీంతో ఏళ్ల తరబడి డిపోలు నడుపుతున్న బినామీలు పలువురు ఒరిజినల్ డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారిని డిపోల వద్దకు తీసుకువచ్చి ఫొటోలు తీయిస్తున్నారు. నగరంలో అందుబాటులో లేని డీలర్లకు ఫోన్లు చేసి రప్పిస్తున్నారు. ఇదిలావుండగా ఒరిజినల్ డీలరుకు బదులు వేరొకరు ప్రతి నెలా సరకులు తీసుకున్న వ్యవహారంపై జేసీ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. శ్రీహరిపురం డిపో 290 డీలర్ మరణిస్తే కుటుంబంలో ఎవరికీ అవకాశం ఇవ్వలేదు. కనీసం నోటిఫికేషన్ జారీ చేసి డీలర్‌ను నియమించాల్సి ఉన్నా...అదేమీ లేకుండా మరొకరికి ఎలా ఇచ్చారో పౌర సరఫరాల అధికారులే చెప్పాలనే వాదన వినిపిస్తోంది. అలాగే మల్కాపురంలో ఒక డీలర్ వివాహం తరువాత విదేశాలకు వెళ్లగా ఆమె తండ్రి డిపో నిర్వహిస్తున్నారు. పెదవాల్తేర్ ప్రాంతంలో ఒక డీలరు ఆరు డిపోలు నిర్వహిస్తున్నారని, పూర్ణామార్కెట్‌లో బియ్యం వ్యాపారి గుప్పిట్లో పలు డిపోలు ఉన్నాయని, వాటిపై జేసీ విచారణ చేయాలని కోరుతున్నారు.

బ్లడ్ బ్యాంకులు ఖాళీ

... 5వ పేజీ తరువాయి

ప్రధాన కారణం వేసవి సెలవుల్లోనే కొన్ని ప్లాన్డ్ సర్జరీలు ఉంటాయి. దీనివల్ల అదనంగా వంద యూనిట్లు వరకు అవసరం అవుతాయి. అదే సమయంలో బ్లడ్ డొనేట్ చేసే వారి సంఖ్య తగ్గుతుంది. బ్లడ్ డొనేట్ చేసే వారిలో దాదాపు 70 శాతం మంది 30 ఏళ్లలోపు వారు ఉంటారు. మిగిలిన 30 శాతం 30 ఏళ్లు పైబడిన వారు ఉంటారు. వేసవిలో 40 ఏళ్లపైబడినవారు డొనేట్ చేసేందుకు ముందుకురారు. మరోవైపు విద్యార్థులు పరీక్షలు, ఇత్యాది కారణాల వల్ల ఫిబ్రవరి నెలాఖరు నుంచి బ్లడ్ డొనేట్ చేసేందుకు ముందుకురారు. ఒకవైపు అవసరానికి మించి డిమాండ్ పెరగడం, మరోవైపు ఆశించిన స్థాయిలో సేకరణ లేకపోవడం వల్ల కొరత ఏర్పడుతున్నట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందంటున్నారు.

ముందుకురావాలి..

గర్భిణులు, ప్రమాద బాధితులు, తలసీమియా, ఎనీమియా వంటి సమస్యలతో బాధపడే వారికి రక్తం అవసరం అవుతుంటుంది. వారికి ఇబ్బందులు లేకుండా రక్తాన్ని సరఫరా చేయాలంటే దాతలు ముందుకు రావాలని బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు కోరుతున్నారు. ఒక్కో దాత నుంచి 350 నుంచి 450 మిల్లీలీటర్లు రక్తాన్ని సేకరిస్తారు. ఏడాదికి కనీసం మూడు నుంచి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదాత నుంచి సేకరించిన రక్తం 35 రోజుల వరకు నిల్వ ఉంటుంది.



వినతిపత్రం అందుకుంటున్న జడ్సీ హైమావతి

పీజీఆర్ఎస్‌కు 10 ఫిర్యాదులు

వేపగుంట మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 10 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 96వ వార్డు పెందుర్తి రైల్వే ఏరియాలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని, 97వ వార్డు క్రాంతినగర్‌లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, 98వ వార్డు అప్పన్నపాలెం గెడ్డ పక్కన రక్షణ గోడ నిర్మించాలని, లక్ష్మీనరసింహనగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, జోన్-8 పరిధిలోని చిరు వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న రోజువారి ఆశీలును రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హాకర్స్ జోన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీముత్యమాంబ ఫుట్‌పాత్, తోపుడుబండ్ల కార్మిక సంఘ ప్రతినిధులు అర్జీని అందజేశారు. వాటిని సంబంధిత శాఖాధిపతులకు పంపించి, తరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జడ్సీ హైమావతి పేర్కొన్నారు.

న్యూ ఐటీఐలో జాబ్ మేళా రేపు

గాజువాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్టీల్ సిటీ న్యూ ఐటీఐలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఐటీఐ, ఇంజనీరింగ్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఆ రోజు ఉదయం అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐకు హాజరు కావాలని సూచించారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, వీల్స్ ఇండియా లిమిటెడ్ (శ్రీసిటీ నెల్లూరు), వరుణ్ మోటార్స్ (విశాఖపట్నం), డెక్కన్ ఫైన్ కెమికల్స్ (తుని) సంస్థల నిర్వాహకులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్ సమీపంలోని కనకమహాలక్ష్మీనగర్‌లో నూతనంగా రూ.32.50 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనానికి కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి నివాళి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ సీపీఎం సుబ్బారావుగా పేరొందిన ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. షీలానగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సుబ్బారావు వర్ధంతి కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 34, బంగాళదుంపలు 16, అరటికాయ (పె) 8, అల్లం (పాతది) 50, బరబాటి 38, ముల్లంగి 22, మునక్కాడలు (కిలో) 40, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 22, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	77
లైవ్ ధర	97
విత్ స్కిన్	164
స్కిన్‌లెస్	174



గాజువాక హైస్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



గోపాలపట్నం పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న పరీక్షల అధికారి

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

» తల్లిదండ్రులతో సందడిగా మారిన ఆయా కేంద్రాల పరిసరాలు

గాజువాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలోని 26 పరీక్ష కేంద్రాల్లో సుమారు ఆరు వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, ఇతర వసతి సదుపాయాలను కల్పించడంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్ష రాసి వచ్చేంత వరకు ఆయా కేంద్రాల పరిసరాల్లో నీడలో వేచివున్నారు. దీంతో ఆయా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూర్మన్నపాలెం: పదో తరగతి పరీక్షల సందర్భంగా అని కేంద్రాల వద్ద ఉదయం గంటల నుంచే సందడి నెలకొంది. ముందుగా పలువురు తల్లి దండ్రులు తమ పిల్లలను సమీపంలో ఉన్న ఆలయా లకు తీసుకువెళ్లి పూజలు చేశాక పరీక్ష కేంద్రాలకు వచ్చారు. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని అధికారులు ప్రకటించడంతో అత్యధికులు 8 గంటలకే చేరుకున్నారు. కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో 225 మంది విద్యార్థులు పరీక్షలకు హాజకు కావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజైనట్టు ప్రధానోపాధ్యాయుడు సూర్య ప్రకాశ్ తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కార్లు, ద్విచక్ర వాహనాలపై ఆయా కేంద్రాలకు రావడంతో కొన్నిచోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

పెదగంట్యాడ: మండలంలోని నడుపూరు ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. న్యూపోర్టు పోలీసులు అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. నడుపూరు హైస్కూల్-1 పరీక్ష కేంద్రంలో 188 మందికి గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరవ్వగా, నడుపూరు హైస్కూల్-2 కేంద్రంలో 250 మందీ పరీక్షలు రాశారు. గంగవరం హైస్కూల్ కేంద్రంలో 105 మందికి ఇద్దరు, ఇస్లాంపేట హైస్కూల్ కేంద్రంలో 210 మందికి గాను నలుగురు, విశాఖ విమల విద్యాలయం కేంద్రంలో 253 మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. బీసీ రోడ్డు చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 239 మందికి గాను అందరూ పరీక్షకు హాజరయ్యారు. ఎంఈవో-1 ఈ శ్రీనివాసరావు, ఎంఈవో-2 కె.రమణాజీలు మూడేసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అగనంపూడి: ఇక్కడి జిల్లా జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 148 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరి కోసం 7 గదులను కేటాయించారు. తొలిరోజు కావడంతో చాలామంది విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టినట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రమీల తెలిపారు.



కణితి హైస్కూల్ వద్ద రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



మింది హైస్కూల్ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం బాలురోన్నత, బాలికోన్నత పాఠశాల, బాలాజీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. గోపాలపట్నం కేంద్రం వద్ద విద్యార్థులకు పరీక్షల అధికారి పలు సూచనలిచ్చారు. ఆయా కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థులందరూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. అన్ని కేంద్రాల పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

మల్కాపురం: ములగాడ మండల పరిధిలో గల మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 1,045 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఆయా కేంద్రాలకు ఉదయం 8 గంటలకే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో చేరుకున్నారు. మల్కాపురం పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సేవల కోసం సిబ్బందిని కూడా నియమించారు. కాగా మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల మెయిన్ రోడ్డుకు దూరంగా ఉండడంతో అక్కడకు చేరుకునేందుకు పలువురు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్‌లో వైద్య శిబిరం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68 వార్డు పరిధిలో ఉన్న అక్కిరెడ్డిపాలెం, మింది హైస్కూళ్లకు ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు చేరుకోవడంతో ఆయా సరిసరాలు సందడిగా మారాయి. పోలీసులు స్కూళ్ల ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాక పరీక్ష కేంద్రంలోకి పంపారు. మింది హైస్కూల్‌కు సుమారు 30 మంది విద్యార్థులు ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు హాజరవ్వడంతో వారి కోసం రెండు గదులను కేటాయించారు.

విద్యార్థులకు భారంగా మారిన దూరం..

పెందుర్తి: పదో తరగతి విద్యార్థులకు 'పరీక్షలు మొదలయ్యాయి. ఒకపక్క ఎండవేడిమితో అల్లాడుతుంటే.. మరోపక్క పరీక్ష కేంద్రాలు ఆమడ దూరం ఉండడంతో పాటు బస్ సదుపాయయం లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. టెన్త్ విద్యార్థులకు టికెట్ లేకుండా ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినా కొన్ని పరీక్ష కేంద్రాలకు బస్సులు వెళ్లే సదుపాయం లేకపోవడం శోచనీయం. మండలంలోని కోటనరవ, గుర్రమ్మపాలెం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు ఆటోలలో చేరుకునేందుకు తొలిరోజు విద్యార్థులు నానాపాట్లు పడ్డారు. ఆయా కేంద్రాల్లో సుమారు 400 మంది విద్యార్థులు పరీక్షలకు రోజూ హాజరు కావాల్సి ఉంటుందని తల్లిదండ్రలుఉ చెబుతు న్నారు. పెందుర్తి నుంచి గుర్రమ్మపాలెం, నరవ పరీక్ష కేంద్రాలు సుమారు 6 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఆటోలలో రాకపోకలు సాగించడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే ఆయా కేంద్రాలకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు చేరుకున్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పదో తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో ఎండ వల్ల విద్యార్థులెవరూ ఇబ్బంది పడకుండా ఉండేందుకు సమితి ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ అందజేస్తామన్నారు.

గాయపడిన ఉక్కు కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వైర్‌రాడ్ మిల్-2 విభాగంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం ఆస్పత్రిలో మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీప రామన్నపాలేనికి చెందిన టి.నర్సింగరావు (34) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి విధులకు హాజరైన ఆయన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్క్రాపర్ చెకింగ్ చేస్తుండగా సుమారు ఏడు అడుగుల ఎత్తు పైనుంచి కింద పడిపోయిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం షాపులో సిబ్బందిని విచారిస్తున్న దృశ్యం

మల్కాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి షాపు మూశాక తాళాలు వేసి సూపర్‌వైజర్ ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం వచ్చి చూసేసరికి సీలింగ్‌కు రంధ్రం పడి ఉండడంతో షాప్ యజమాని ఆందోళనకు గురయ్యాడు. షాపులోని ఖరీదైన మద్యం బాటిళ్లతో పాటు క్యాష్ బాక్సులో ఉంచిన సుమారు రూ.లక్ష చోరీకి గురైనట్టు గుర్తించి మల్కాపురం క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ ఎస్ఐ రమణ, హెచ్‌సీ ఖాసీమ్, తదితరులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13 మంది మందుబాబులకు జరిమానా

పెందుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 13 మందికి రూ.లక్షా 30 వేలను జరిమానాను కోర్టు విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు సోమవారం తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడిన 13 మందిని రెండో స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు ముందు హాజరు పరచగా కోర్టు పైవిధంగా తీర్పునిచ్చిందన్నారు. ఇందులో విజయనగరం జిల్లా రామభద్రపురానికి చెందిన కోరాయి మహేశ్ అనే వ్యక్తికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలుశిక్ష కూడా పడిందని పేర్కన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఎస్.భవానీశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ విప్లవ దశలో ప్రపంచం ఉందన్నారు. మానవ జీవితాన్ని సులభతరం చేయడానికి సాంకేతికను వినియోగిస్తోందన్నారు. విద్యార్థుల కోసం ఇటువంటి సదస్సులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం భవానీశంకర్‌ను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ నిర్మాణానికి అనుమతివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



పెందుర్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం కూడలిలో శిథిలావస్థకు చేరిన సీహెచ్‌సీ పునర్నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌ బాబు అసెంబ్లీలో కోరారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పెందుర్తి నియోజకవర్గ సమస్యలను ఆయన వివరించారు. నాలుగు నియోజవర్గాలకు కలుపుతూ ఉన్న సబ్బవరం కూడలిలో సీహెచ్‌సీ నిర్మాణం చేపట్టడం అత్యంత అవసరమన్నారు. అనకాపల్లి-ఆనందపురం హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగితే బాధితులను ఎక్కువగా సబ్బవరంలో గల సీహెచ్‌సీకే తీసుకువస్తారన్నారు. సబ్బవరంలో సీహెచ్‌సీని నిర్మించాలనే కృతనిశ్చయంతో ఉంటే పెందుర్తిలో సీహెచ్‌సీ ఉన్నందున ఇక్కడ ఏర్పాటు చేయడం కుదరదని వైద్య, ఆరోగ్య శాఖ చెబుతున్నారని పేర్కొన్నారు. పెందుర్తి విశాఖ జిల్లాలో, సబ్బవరం అనకాపల్లి జిల్లాలో ఉందని.. అందువల్ల సబ్బవరంలో సీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిస్తే ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చేపడతామన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా పోలీసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

పెదగంట్యాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి ఐదు ప్రధాన కూడళ్లలో రూ.ఐదు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను టీడీపీ డిప్యూటీఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో రాత్రివేళ చీకటిగా ఉండడవల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించి ఈ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నడుపూరు రమాబాయి అంబేడ్కర్ యువజన సేవాసంఘం కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు డైరెక్టర్‌ను కలిసిన ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (కమర్షియల్)గా బాధ్యతలు స్వీకరించిన సలీమ్ జి పురుషోత్తమన్‌ను సోమవారం ఇంటక్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఉక్కు కర్మాగారంలో అధిక ఉత్పత్తికి కృషి చేసి ప్రగతిపథంలో నడిపించాలని కోరారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, బీఎన్ రాజు, పీవీ రమణమూర్తి, నీరుకొండ రామచంద్రరావు, ఎస్పే నాయుడు, ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం 89వ వార్డు పరిధి ఎల్లపువానిపాలెం శ్మశానవాటికలో మొక్కలు నాటారు. అలాగే గ్రామ కమిటీ ప్రతినిధులతో కలిసి జేడీ ఫౌండేషన్ సభ్యులు శ్మశానవాటికలో చెత్తాచెదారాన్ని తొలగించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌ను తొలగించాలి

69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖలో అభివృద్ధి పనులను ఆటంకపరుస్తూ, అవినీతికి పాల్పడుతున్న జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తొలగించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. తుంగ్లాంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కాలనీ అఖిల పక్ష అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృష చేస్తుంటే.. సీఈ శివప్రసాద్ ఆయా పనులకు అనేక ఆటంకాలు పెడుతూ శంకుస్థాపనలకే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. మింది చెరువుకు ఆనుకుని పీహెచ్‌సీని, తుంగ్లాం చెరువుకు ఆనుకుని గ్రామ కంఠ స్థలంలో శంకుస్థాపన చేసిన తారకరామ కల్యాణ మండప నిర్మాణాలను అకారణంగా నిలిపివేయడం భావ్యం కాదన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వాస్తవాలను గుర్తించి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న సీఈపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కాలనీ నాయకులు నావన సింహచలం, కొల్లి అప్పలరెడ్డి, వరహాలు, అర్జున్, వి.గోపి, అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శిథిల వాటర్ ట్యాంక్ పరిశీలన



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్, తదితరులు

కూర్మన్నపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును సోమవారం తాగునీటి విభాగ ఈఈ శ్రీనివాస ప్రసాద్, ఏఈ కేదారినాథ్, కార్పొరేటర్ బొండా జగన్ లు పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో స్పోర్ట్సు కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అడ్డంగా ఉన్న, శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును ఇక్కడ నుంచి తక్షణమే తొలగించి మరోచోట కొత్తది నిర్మించాలన్నారు. వార్డు పరిధిలో తాగునీటి పైపు లైన్ల మరమ్మతుల వల్ల సరిపడా నీరు లభించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈఈ, ఏఈలు సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. వార్డుల్లో తాగునీరు దుర్వినియోగం కాకుండా చూడాలని, ప్రతి ఇంటికి వాటర్ క్యాప్‌లు వేసేలా చర్యలు చేపట్టాలని, తాగునీటిని వృథా చేస్తున్న వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, మాటూరి రాము, ఆనంద్‌కుమార్, దానయ్య, నాగభూషణం, పరమానందం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ కోటి దీపాల జాతర

అగనంపూడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి కోటిదీపాల జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. తొలేళ్ల ఉత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు పోలిపల్లి అమ్మవారి పండగ

వేపగుంట: గ్రేటర్ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు పోలిపల్లి అమ్మవారు పండగను మంగళవారం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సాయంత్రం పరస నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి త్రిశక్తి ఆలయ వార్షికోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుపుతామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం తిరువీధి ఉత్సవం, 19న విశేష పూజలు, హోమాలు, 20న దివ్య కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు ఆర్చి వద్దకు సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ ఆవిర్భవించి 55 ఏళ్లు పూర్తి చేసుకుని 56వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సమృద్ధ్ సంరక్షణ పేరుతో మన దేశంలో 6,500 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతాల్లో దేశ భద్రత, సమైక్యత పెంపొందిస్తూ చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ మంగళవారం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్దకు చేరుకుంటుందని ఇక్కడి సీఐఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. వెస్ట్ బెంగాల్‌లోని భక్కాలిలో ఈ నెల 7న 60మంది సభ్యులతో ఈ సైకిల్ ర్యాలీ ప్రారంభమైందన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆళ్వార్స్ విద్యార్థుల ప్రతిభ

వేపగుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం బంకు సమీపంలోని ఆర్ఆర్‌వీపురం ఆళ్వార్స్ క్యాంపస్‌లో జాన్సన్ లిఫ్ట్ తయారీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఆళ్వార్స్ క్యాంపస్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ ఇంటర్వ్యూల్లో 34 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు సంస్థ హెచ్‌ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. వారికి నియామక ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాలల గ్రూప్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌వీహెచ్ రాజేంద్ర, ఈడీ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్, గోపాలపట్నం క్యాంపస్ కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తులసీ కృష్ణకుమార్, తదితరులు అభినందించారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

గాజువాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్-30 ద్వారా నివాసితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దార్ శ్రీవల్లికి సోమవారం బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారికి ఇళ్ల పట్టాలను త్వరితగతిన ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ జీవోను గాజువాక ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకునే చేడాలని విజ్ఞప్తి చేశారు.

'కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



సమావేశంలో పాల్గొన్న శ్రామిక సంఘ నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రామిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంటులో సోమవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, నిత్యం ఆందోళనతోనే జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉత్పత్తులను రాష్ట్ర ప్రాజెక్టులకు వినియోగించాలని, తద్వారా ప్లాంట్‌కు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు. సమావేశంలో నాయకులు బొడ్డు పైడిరాజు, సత్యారావు, కోటేశ్వరరెడ్డి, బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం


పరీక్షలకు వెళ్లే ముందు సంపత్ వినాయకుని ఆలయంలో విద్యార్థుల పూజలు


ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థినులను తనిఖీ చేస్తున్న దృశ్యం


కేడీపీఎం పాఠశాలలో పరీక్ష రాసేందుకు అంధ విద్యార్థినులు

- కేంద్రాల వద్ద తల్లిదండ్రుల హడావుడి
- సంపత్ వినాయగర్‌కు విద్యార్థుల పూజలు
- క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపిన సిబ్బంది

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తల్లిదండ్రులతో కలిసి గంట ముందుగానే ఆయ కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. అంతుకుముందు పలువురు విద్యార్థులు సంపత్ వినాయగర్ ఆలయంలో పూజలు చేశారు. కాగా ప్రతి విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే సిబ్బంది కేంద్రాల్లోకి అనుమతించారు. పలు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, జిల్లా విద్యాశాఖాధికారులు పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను బస్సుల్లో ఉచితంగా తరలించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


కేడీపీఎం పాఠశాల వద్ద విద్యార్థులు

జీవీఎంసీలో పెండింగ్ బిల్లులు చెల్లించండి

కలెక్టర్‌ను కోరిన కాంట్రాక్టర్లు


కలెక్టరేట్‌లో జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులుచేసిన కాంట్రాక్టర్లకు ఏడాదిగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు సోమవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందజేశారు. గత ఏడాది మార్చి 28 నుంచి రూ.400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం బిల్లు బకాయిలను చెల్లించాలని, ఆర్థిక సంవత్సరం ముగిస్తే బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో సంఘం ప్రతినిధులు గొంపచంద్రమౌళి, ఆర్‌సాధూరావు, మద్దాల రమేష్, షేక్ సిలార్ తదితరులున్నారు.

పలు రైళ్లకు అదనపు స్లీపర్ క్లాస్ కోచ్‌లు

విశాఖపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సోమవారం నుంచి విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు (22820/22819), విశాఖ-కొరాపుట్-విశాఖ మధ్య నడిచే రైళ్లకు (18512/18511) రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు జత చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-గుణుపూర్-విశాఖ మధ్య నడిచే రైళ్లకు మంగళవారం నుంచి స్లీపర్ క్లాస్ కోచ్ జత చేస్తున్నామన్నారు.

నగరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు

ఐపీఎల్‌కు పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు సోమవారం నగరానికి చేరుకున్నారు. కెప్టెన్ అక్షర్ పటేల్‌తో సహా సభ్యులంతా విమానాశ్రయానికి చేరుకున్నారు. మంగళవారం నుంచి ప్రాక్టీస్ ప్రారంభిస్తారు.
- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


షనక


కరణ్ నాయర్


టి.నటరాజన్


ట్రిస్టన్ స్టబ్స్

త్వరలోనే మార్కెట్లోకి 'విటారా' ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

సిరిపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ విటారా కారు మార్కెట్లోకి రావడం శుభ పరిణామమని పలువురు అభిప్రాయపడ్డారు. సిరిపురంలోని వరుణ్‌మోటార్స్ మారుతీసుజుకీ నెక్స్ షోరూంలో సోమవారం సాయంత్రం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'విటారా' కారును ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆర్‌సీహెచ్.శ్రీనివాస్, వరుణ్‌గ్రూప్ ఛైర్మన్ వి.ప్రభుకిషోర్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద మాట్లాడుతూ సరికొత్త ఫీచర్స్‌తో తొలి ఎలక్ట్రిక్ విటారా కారు రావడం ఆనందకరమన్నారు. మంచి ఇంటీరియల్‌తో పాటు కారు సుందరంగా ఉందన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లకు ఎక్కువ ఆదరణ లభిస్తోందని, ఎక్కువ బ్యాటరీ సామర్థ్యంతో విటారా సౌకర్యవంతంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వరుణ్ గ్రూప్ ఛైర్మన్ వి.ప్రభుకిషోర్ మాట్లాడుతూ మారుతీసుజుకీ మార్కెట్లోకి తన బ్రాండ్‌ను విడుదల చేయాలంటే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదల చేస్తుందన్నారు. కొంత కాలంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలపై చర్చ నడుస్తోందన్నారు. వరుణ్‌మోటార్స్ నెక్సాలోని తొలుత విటారా కారును త్వరలోనే మార్కెట్లోకి విడుదల చేస్తుందన్నారు. అత్యంత ఎక్కువ సర్వీస్ అందించడంలో మారుతీసుజుకీ ముందుందన్నారు. కార్యక్రమంలో జేసీబీ డైరెక్టర్ వినోద్, భారత్‌బెంజ్ డైరెక్టర్ సుబ్బారావు, నెక్సా జీఎం సేల్స్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


విటారా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 341 అర్జీలు

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 341 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 163, జీవీఎంసీ 85, పోలీసు 27, ఇతర విభాగాలకు 66 అర్జీలు ఉన్నాయి. వినతుల స్వీకరణ తరువాత కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పెండింగ్ అర్జీలపై అధికారులతో సమీక్షించారు. అర్జీలు స్వీకరించి 48 గంటలైనా పరిశీలించని అధికారులపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలుమార్లు నిర్దేశించినా ఒకే సమస్యపై పదే పదే అర్జీలు ఎందుకు వస్తున్నాయని, అధికారులు వాటిని పరిష్కరించే తీరులో మార్పు రావాలన్నారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ వైద్య సేవ క్షేత్రస్థాయి ఉద్యోగులు విధులను బహిష్కరించి ఏపీ ఆరోగ్య మిత్రా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 17 సంవత్సరాలుగా క్యాడర్ అమలు జరగకపోవటంతో ఎంటీఎస్ లేదా ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తింపు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు వెయిటేజ్ లేదు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు లేవని, సంక్షేమ పథకాలు అందటంలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదన్నారు.

సుగుణ కుటుంబానికి న్యాయం చేయాలి

అప్పు తీసుకున్న పాపానికి వేధింపులకు పాల్పడటంతో రుణమిచ్చిన వారి ఇంటిలోనే ఆత్మహత్యకు పాల్పడిన బొడ్డు సుగుణ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె బంధువులు, స్థానికులు అభ్యర్థించారు. సుగుణది హత్య అని ఆరోపిస్తూ, నిందితులను అరెస్టు చేసి న్యాయం చేయాలని ఆందోళన చేశారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

ప్రభుత్వ భూమిలో వాణిజ్య కార్యకలాపాలు

ఆనందపురం మండలం గిడిజాల రెవెన్యూలో సర్వేనంబరు 310/5,311/14,312/5లో సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని భవనాలు నిర్మించి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిసున్న వ్యక్తిపై కొందరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేస్తూ తక్షణమే ఆక్రమణలు తొలగించాలని కోరారు. మండల అధికారులు ఆక్రమణదారుడితో కుమ్మక్కైపోయారని ఆరోపించారు.

మూసివేసిన కాలువ ఓపెన్ చేయించండి

మధురవాడలో మానం ఆంజనేయులు నగర్‌లో పేద వర్గాలకు ఇచ్చిన లేఅవుట్ నుంచి వెళ్లే మురుగుకాల్వను సమీపంలో ఒక వ్యక్తి మూసివేశారని కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. కాలనీకి ఆనుకుని సర్వేనంబరు 126/4లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి తిరిగి కాలనీవాసులను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో వాపోయారు. కాలనీ నుంచి వెళ్లే మురుగుకాల్వ మూసివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం... crime news

సెంట్రల్ జైల్లో సెల్‌ఫోన్ల వ్యవహారం

- ఫార్మాసిస్టు, అతడి భార్య అరెస్టు
- కేసులో మరో ముగ్గురి ప్రమేయం

ఆరిలోవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు కలకలం రేపిన కేసులో ఫార్మాసిస్టుగా పనిచేసిన కడియం శ్రీనివాస్‌ను, అతడి భార్యను పోలీసులు అరెస్టు చేశారు. డబ్బు తీసుకుని ఈ పనికి అంగీకరించినట్టు దర్యాప్తులో తేలడం, శ్రీనివాస్ భార్య బ్యాంకు ఖాతాలో నగదు జమకావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ కేసులో నిందితులు శ్రీనివాస్, అతని భార్య పుష్పలతను ఆదివారం అరెస్టు చేసి, రిమాండుకు పంపినట్టు సీఐ మల్లేశ్వరావు తెలిపారు. సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నాగమల్లేశ్వరరావు, మహేష్, రమేష్‌లకు కడియం శ్రీనివాస్ సెల్‌ఫోన్లు అందించేందుకు ముందుగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. తన భార్య బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ చేయాలని డిమాండ్ చేయడంతో ఖైదీలు తమ వారి ద్వారా డబ్బు వేశారు. ఆ తరువాత రహస్యంగా జైల్లోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లి వారికి అందించినట్టు దర్యాప్తులో తేలింది. దీంతో దంపతులిద్దరినీ అరెస్టు చేశామని సీఐ వివరించారు. కాగా ఈ కేసులో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్టు తేలిందని, వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు.

చిన్నారిని చిదిమేసిన తల్లి

భర్త అనుమానంతో బయటపడిన ఘాతుకం

ఆరిలోవ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భర్తతో మనస్పర్థల నేపథ్యంలో మనస్తాపానికి గురైన వివాహిత తన చిన్నారి పీక పిసికి సముద్రంలోకి విసిరేసింది. తానూ ఆత్మహత్యకు ప్రయత్నించగా స్థానికులు స్పందించడంతో బతికి బయటపడింది. ఈ అమానుష ఘటనలో అసలు నిజం సోమవారం బయటపడింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెదగదిలి కూడలికి సమీపంలో నివసిస్తున్న గొర్లె వెంకటరమణ, శిరీషలకు 11 ఏళ్ల కిందట వివాహం జరిగింది. పిల్లలు పుట్టకపోవడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. కాగా వారికి గత ఏడాది అక్టోబరులో ఆడపిల్ల జన్మించింది. లేకలేక కలిగిన సంతానం కావడంతో వెంకటరమణ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అల్లారుముద్దుగా ఆమెను పెంచుకుంటున్నాడు. కాగా ఈనెల 13వ తేదీన శిరీష తన కుమార్తెను తీసుకుని తెన్నేటి పార్కు సమీపంలోని తీరానికి వెళ్లింది. అక్కడి షిప్ వద్దకు చేరుకుని, పాప నీటిలో పడిపోయి, కనిపించకుండా పోయిందంటూ భర్తకు ఫోన్ చేసింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న వెంకటరమణ పాప ఆచూకీ తెలుసుకుని ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. భార్య ప్రవర్తనపై అనుమానంతో ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు శిరీషను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో కుమార్తెను పీక పిసికి సముద్రంలో పడేసి నట్టు అంగీకరించింది. భర్తతో మనస్పర్థల కారణంగా జీవితంపై విరక్తి చెందానని, కుమార్తెను చంపేసి, తానూ చనిపోదామని నిర్ణయించుకున్నానని వెల్లడించింది. పాపను చంపేసిన తరువాత శిరీష సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా, సమీపంలోని వారు రక్షించినట్టు సీఐ తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసి, రిమాండుకు పంపించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

ఆనందపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని బాకురుపాలెంలో ఆదివారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిసిన వివరాల మేరకు పందలపాక పంచాయతీ బాకురుపాలెం గ్రామానికి చెందిన పలికల రమేష్ (26) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తన తండ్రితో ఆదివారం ఘర్షణపడి సమీపంలోని కళ్లాల వద్దకు వెళ్లి ఉరివేసుకున్నాడు. అతడి చిన్నాన్న చూసి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

సీతంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కత్తితో దాడి చేసి ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన నిందితుడిని ద్వారకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కైలాసపురానికి చెందిన ఉమ్మిడి రాజేష్‌కు కాంప్లెక్స్ సమీపంలోని ఓ డార్మెటరీలో ప్రసాద్ పరిచయమై ఆదివారం రాత్రి బయటకు వెళ్లారు. అక్కడ గొడవపడి కత్తితో రాజేష్‌పై ప్రసాద్ దాడిచేశాడు. రాజేష్ ఫిర్యాదు మేరకు సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి సుంకర పేరు


విగ్రహావిష్కరణలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

మహారాణిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో న్యూరో సర్జరీ విభాగానికి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు పేరు పెట్టారు.బాలపరమేశ్వరావు ఏఎంసీలో చదువుకుని న్యూరో సర్జరీలో ఎంసీహెచ్ పూర్తిచేసి కేజీహెచ్‌లో 1956లో న్యూరో సర్జరీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అతని సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ విభాగానికి ఆయన పేరు పెట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఐ.దినకర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు పూలమాల వేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాల పరమేశ్వరరావు సేవలను కొనియాడా రు. అనంతరం ఆయన పాల్గొన్న వివిధ కార్యక్రమాలతో కూడిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్రేమా ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ, డాక్టర్‌బి.సుబ్బారావు, డాక్టర్ ఆర్.శశిప్రభ, వరుణ్ గ్రూప్ అధినేత ప్రభుకిషోర్, కేజీహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సం ధ్యాదేవి, న్యూరో వైద్యనిపుణులు డాక్టర్ ప్రేమ్‌జిత్, డాక్టర్ హయగ్రీవరావు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్, బాల పరమేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో భద్రతా దళాలది కీలకపాత్ర

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- నగరానికి చేరిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న వారితో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోర్టు ఛైర్మన్ అంగముత్తు తదితరులు

బీచ్ రోడ్డు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో కేంద్ర భద్రతాదళం కీలకపాత్ర వహిస్తుందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్కే బీచ్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సురక్షిత తీరాలు, సమృద్ధి భారతదేశం నినాదంతో సైక్లోథాన్ ర్యాలీ నిర్వహించారన్నారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక భద్రత దృష్ట్యా 1969 మార్చి 10న సీఐఎస్ఎఫ్ భద్రతాదళం ఏర్పాటు చేశారన్నారు. సుమారు 2 లక్షలకు పైగా బలగాలు దేశ రక్షణ, అంతర్గత పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. 25 రాష్ట్రాలలో, 358కి పైగా యూనిట్లలో దేశా వాసుల ప్రాణాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను కాపాడుతూ, శాంతిభద్రతలో కీలకంగా మారారన్నారు. ఆరువేల కిలోమీటర్లకుపైగా సముద్ర తీర ప్రాంత ప్రజల్లో దేశ భద్రత, సమైక్యతను పెంపొందిస్తూ, వారితో మమైకమై సైకిల్ ర్యాలీని ఈనెల ఏడో తేదీన పశ్చిమబెంగాల్‌లోని బక్కాలీలో ప్రారంభించారని, ఈ యాత్ర తమిళనాడులోని కన్యాకుమారి వరకు 60 మంది సభ్యులతో సాగుతుందన్నారు. విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ దేశంలో అత్యున్నత ప్రమాణాలు గల భద్రతను అందిస్తున్న పారా మిలటరీ దళం సీఐఎస్ఎఫ్ మహోన్నత ఆశయంతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తోందన్నారు. జాతీయ భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ఉగ్రవాదం, మాదక ద్రవ్యాల నివారణ పై తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా యాత్ర సాగుతోందన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ చేస్తున్న సభ్యులను సన్మానించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి పి.వేణుగోపాల్, ఎన్‌టీపీసీ (సింహాద్రి) భద్రతా దళం డిప్యూటీ కమాండెంట్ వినీత్‌కుమార్ ప్రభాకర్, సీఐఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.